


# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 84 | ది. 1-7-2026 | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 84 | Date : 1-7-2026 | Wednesday | Pages : 8 | Rs.1/- |

# వికసిత భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి పిలుపు
- కేంద్రీయ గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో ప్రసంగం
- పట్టభద్రుల్లో 40 శాతం, స్వర్ణ పతక విజేతల్లో 70 శాతం అమ్మాయిలేనని హర్షం
- ఆధునిక సాంకేతికతతో గిరిజన సంస్కృతికి పునరుజ్జీవం తీసుకురావాలని సూచన
- గిరిజన విశ్వవిద్యాలయాలు ఆత్మవిశ్వాస కేంద్రాలుగా ఎదగాలి

**విశాఖపట్నం,జూన్ 30 (వార్తాప్రభ) :** వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో దేశ యువతదే కీలక పాత్ర అని,విద్య, సాధికారతే వారి ప్రధాన ఆయుధాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన గిరిజన సంస్కృతి, వారసత్వానికి పునరుజ్జీవం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం నాడు విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టాలు, పతకాలు అందుకున్న విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ యూనివర్సిటీలో పట్టాలు పొందిన విద్యార్థులలో దాదాపు 40 శాతం మంది, స్వర్ణ పతకాలు సాధించిన వారిలో 70 శాతం మంది అమ్మాయిలే కావడం పట్ల ఆమె ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఇది మహిళా సాధికారతకు, లింగ సమానత్వం పట్ల సంస్థకున్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గిరిజన విశ్వవిద్యాలయాలపై ప్రత్యేక



బాధ్యతలు ఉన్నాయని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ సంస్థలు కేవలం విద్యా కేంద్రాలుగా మిగిలిపోకుండా, గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, విధాన రూపకల్పనకు కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వనాధికారాల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ఇలాంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో ఈ విశ్వవిద్యాలయం గిరిజన యువత సర్వతోముఖాభివృద్ధికే కాకుండా, ఈ ప్రాంత సమగ్ర వికాసానికి కూడా గణనీయమైన కృషి చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రియమైన విద్యార్థులారా, ఈ స్నాతకోత్సవం మీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఇది సంతోషించుకునే రోజే అయినా, భవిష్యత్తుపై సంకల్పం తీసుకోవడానికి కూడా ప్రేరణనిస్తుంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే యువత నూతన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు, మీ పరిసరాల నుంచి నేర్చుకుంటూ, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. తమ సంస్కృతి, సంప్రదాయాలతో అనుబంధం కొనసాగిస్తూనే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలని అన్నారు. అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, చిరుధాన్యాలు, ఔషధ మొక్కలు, ఎకో-టూరిజం, స్థానిక నైపుణ్యాలను ప్రోత్సహించేలా గిరిజన విశ్వవిద్యాలయాల్లో నూతన ఆవిష్కరణలు జరగాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఉత్తరాంధ్ర గిరిజన తెగల సాధికారత కోసం ఈ వర్సిటీ 'సైన్స్ అండ్ టెక్నాలజీ హబ్'ను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఇంధన పరిరక్షణ వంటి అంశాలపై ఈ విశ్వవిద్యాలయం దృష్టి సారించిందని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమ సమాజంతో కూడిన వికసిత భారత్ నిర్మాణంలో ఈ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# ఖనిజ నిల్వలపై మినరల్ మ్యాపింగ్

- ఖనిజాలకు విలువ జోడింపుపై ప్రత్యేక దృష్టి
- మినరల్ వెల్త్ మార్కెట్ క్యాపిటలైజేషన్‌పై అధ్యయనం
- టెక్నాలజీ వినియోగంతో కట్టుదిట్టంగా ఉచిత ఇసుక తవ్వకాల పర్యవేక్షణ
- గనుల శాఖపై సమీక్ష లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, జూన్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విలువైన ఖనిజ నిల్వల్ని గుర్తించేలా మినరల్ మ్యాపింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. క్రిటికల్ మినరల్స్, బల్క్ మినరల్స్‌తో పాటు విలువైన లోహాలు లభ్యం అయ్యే ప్రాంతాల మ్యాపింగ్ జరగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వెలికి



తీసే ఖనిజాలకు విలువ జోడించేలా ప్రాసెసింగ్ ప్రక్రియను నిర్వహించే అంశంపైనా దృష్టి సారించాలని సూచించారు. క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ఖనిజ సంపదకు సంబంధించి మార్కెట్ క్యాపిటలైజేషన్ కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. రాష్ట్రప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ ద్వారా విలువైన ఖనిజాల మార్కెట్ క్యాపిటలైజేషన్‌కు అవకాశం ఉందన్నారు. దీనిపై నిపుణులతో కలిసి అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బీచ్ శాండ్, రేర్ ఎర్త్ మినరల్స్, ముడి ఇనుము, మాంగనీస్, అల్యూమినా లాంటి వివిధ ఖనిజాలకు విలువ జోడింపు ప్రక్రియ ద్వారా గరిష్టంగా రెవెన్యూను ఆర్జించేందుకు ఆస్కారం ఉందని సీఎం అన్నారు. దేశంలోని కొన్ని రాష్ట్రాలు ఖనిజ ఆదాయం కారణంగానే రెవెన్యూ మిగులు సాధించాయని సీఎం వ్యాఖ్యానించారు. ఖనిజాల వ్యాల్యూ అడిషన్ కు సంబంధించి విస్తృతంగా చర్చించి ఓ ప్రత్యేక విధానం తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోనే ఈ ఖనిజాల విలువ జోడింపు ప్రక్రియ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీ, ఒడిశా, కేరళ లాంటి రాష్ట్రాల్లో లభ్యమయ్యే అత్యంత విలువైన రేర్ ఎర్త్ మినరల్స్‌పై క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. టైటానియం, ఇలమనైట్, మోనజైట్ లాంటి హై వాల్యూ మినరల్స్ నిల్వలు ఏమేరకు ఉన్నాయన్న దానిని గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్స్, మాగ్నెట్స్ సహా విలువైన లోహాలను తయారు చేసేందుకు రేర్ ఎర్త్ మినరల్స్ వెలికితీత జరగాలన్నారు. ప్రత్యేకమైన పరికరాల తయారీకి కీలకమైన ఈ లోహాలు అణు ఇంధనం సహా వ్యూహాత్మకంగా దేశానికి కూడా అత్యంత కీలకమని సీఎం అన్నారు. రాష్ట్రంలో జొన్నగిరి సహా చిత్తూరు జిల్లా చిగురుగుంట వద్ద కూడా బంగారం నిల్వలు ఉన్నాయని మిగతా బ్లాక్స్ పై కూడా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి గనుల శాఖకు సూచనలిచ్చారు.

**టెక్నాలజీతో ఇసుక సరఫరా కట్టుదిట్టం..** రాష్ట్రంలోని 126 ప్రాంతాల్లో క్రిటికల్, బల్క్ ఖనిజాలు సహా ఇతర విలువైన ఖనిజాలను గుర్తించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుతం మైనింగ్ ఆపరేషన్స్ ద్వారా రెవెన్యూలో 18 శాతం మేర వృద్ధి నమోదైనట్టు తెలిపారు.

# జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

- డా. బి.సి. రాయ్ విగ్రహావిష్కరణ -- వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులకు సత్కారం
- డా. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్

**విజయవాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** భారతరత్న డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జూలై 1 న నిర్వహించే జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఈ ఏడాది కూడా విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఘనంగా నిర్వహిస్తుందని ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.



కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై భారతరత్న డాక్టర్ బి.సి. రాయ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన, సమాజ సేవ రంగాల్లో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులను ఘనంగా

- 2లో

# సమాచార పౌర సంబంధాల శాఖ లో ఇద్దరు అధికారులకు ఘన వీడ్కోలు





**విజయవాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** సమాచార పౌర సంబంధాల శాఖ లో 34 ఏళ్లపాటు సుదీర్ఘ సేవలు అందించి పదవీ విరమణ చేసిన అకౌంట్స్ ఆఫీసర్ పి. సుదర్శన్ రావు, రిసెప్షనిస్ట్ కె. స్వామి శేఖర్ లకు ఘన సన్మానం నిర్వహించారు. స్థానిక పండిట్ నెహ్రూ బస్టేషన్ ప్రాంగణంలో ఉన్న డా. నందమూరి తారకరామారావు పరిపాలనా భవనం రెండవ అంతస్థు లోని సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకుల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో, అంకితభావంతో విశిష్ట సేవలందించిన ఇద్దరు అధికారులు ఉద్యోగ విరమణ చేశారు. గణాంక విభాగంలో అకౌంట్స్ ఆఫీసర్ గా విధులు నిర్వర్తించిన పి. సుదర్శన్ రావు, రాష్ట్ర సమాచార కేంద్రంలో రిసెప్షనిస్ట్ గా సేవలందించిన కె. స్వామి శేఖర్ లు వారి 34 సంవత్సరాల సుదీర్ఘ ప్రభుత్వ సేవను విజయవంతంగా పూర్తి చేసి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, సహాయ సంచాలకులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, గణాంక విభాగ అధికారులు పలువురు ఉన్నతాధికారులు, సుదర్శన్ రావు, కె. స్వామి శేఖర్ లు తమ సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతాయుత సేవాభావంతో శాఖకు విశేష సేవలందించారని కొనియాడారు. ప్రభుత్వ సమాచారాన్ని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో వారు నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. వారి అనుభవం, సేవలు శాఖకు చిరస్థాయిగా మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. వారి అనుభవాలను, మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. పదవీ విరమణ అనంతరం వారి జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందోత్సాహాలతో, కుటుంబ సభ్యుల మధ్య సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులను శాఖ తరపున శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు ఐ. సూర్యచంద్ర రావు, షేక్. మహబూబ్ భాషా, పి. తిమ్మప్ప, చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూధన, డిప్యూటీ డైరెక్టర్లు పి. వెంకట్రాజు గౌడ్, డి. రమేష్, కె. నారాయణ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు ఏఎస్ వీరభద్రరావు, పి. రాజశేఖర్, ఎస్వీ మోహన్ రావు, డా. కే. తిరుపాలయ్య, జేఏవో నాగరాజు, రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) పి. కిరణ్ కుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ వివిధ విభాగాల అధికారులు, ప్రాంతీయ అధికారులు, వారి కుటుంబ సభ్యులు, అకౌంట్స్ అధికారుల సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరించండి. సునీల్ మిట్టల్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

- సీఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ
- హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరణకు ఆహ్వానం
- డిజిటల్, క్లౌడ్, ఏఐ రంగాలపై దృష్టి పెట్టాలని సూచన
- తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా వివరణ
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రస్తావన
- ఐటీఐలు, పాలిటెక్నిక్‌ల ఆధునీకీకరణపై చర్చ





**హైదరాబాద్,జూన్ 30 (వార్తాప్రభ) :** తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ రంగాల్లో కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో రేవంత్ రెడ్డిని మంగళవారం సునీల్ భారతి మిట్టల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులకు అనుకూలంగా తీసుకొచ్చిన సంస్కరణలపై సీఎం వివరించారు. రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా మారుతోందని పేర్కొన్న సీఎం విద్యా రంగంలో చేపడుతున్న మార్పులను కూడా వివరించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు తగ్గట్టుగా యువతకు నైపుణ్యాలు అందించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి కూడా సునీల్ మిట్టల్‌కు వివరించారు. అలాగే ఐటీఐలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) మారుస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునికీకరిస్తున్నామని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంకేతిక రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌టెల్ కూడా తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు.

# ఉద్యోగుల సంక్షేమంమే ధ్యేయం గా అడుగులు వేస్తున్నాం

- ఐటిఐ ఉపాధి శాఖల నాగార్జున సేవలు చిరస్మరణీయం
- ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ





**విజయవాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** ఉద్యోగుల నమ్మకానికి అనుగుణం గా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎ పి ఎన్ జి జి ఓ సంఘం అడుగులు వేస్తోందని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం లోను ఐ టి ఐ శాఖలో లో కీలక పాత్ర వహించిన వి.నాగార్జున అందించిన సేవలు అభినందనీయమని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ అన్నారు. ఐ టి ఐ కళాశాల సూపరింటెండెంట్ గా పనిచేసి మంగళవారం పదవీ విరమణ సందర్భం చేసిన వి.నాగార్జున కు ఐ టి ఐ కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి వి రమణ మాట్లాడుతూ ముఖ్య అతిథిగా హాజరై నాగార్జున దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డి వి రమణ మాట్లాడుతూ ఐ టి ఐ శాఖలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహిస్తూనే, ఏపీ ఎన్జీజీవో సంఘ జిల్లా సహాధ్యక్షుడు గా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కె. నాగార్జున అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. సంఘ బలోపేతం, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వంతో చర్చలు, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో సంఘం చేస్తున్న కృషి వెనుక నాగార్జున కృషి మరింత తోడ్పాటును అందించాయని అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి చేస్తున్న కృషిలో భాగంగా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వంతో నిర్మాణాత్మక చర్చలు జరిపి పలు కీలక సమస్యల పరిష్కారంలో సంఘం విజయవంతమైన పాత్ర పోషించిందన్నారు.మెమో-57 ప్రకారం 2004కు ముందు నోటిఫికేషన్ పొందిన పోస్టులపై నియమితులైన సుమారు 11 వేల మంది ఉద్యోగులకు సీపీఎస్ స్థానంలో ఓపీఎస్ అమలు దిశగా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకునేలా సంఘం నిరంతర కృషి చేస్తామన్నారు .భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమం, సేవా భద్రత, పెన్షన్, వేతనాలు, పదోన్నతులు, పదవీ విరమణ ప్రయోజనాలు సహా అన్ని అంశాల్లో ఏపీ ఎన్జీవో సంఘం చిత్తశుద్ధితో పనిచేస్తుందని డి వి రమణ పేర్కొన్నారు. సభలో పాల్గొన్న నాయకులు, ఉద్యోగులు నాగార్జునను ప్రశంసిస్తూ ఉద్యోగ బాధ్యతలతో పాటు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నగర, జిల్లా స్థాయిల్లో వివిధ హోదాల్లో అంకితభావంతో సేవలందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారని పలువురు కొనియాడారు. కార్యక్రమము లో ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఆర్ వి రమణ ప్రభుత్వ ఐ టి ఐ కళాశాల ప్రిన్సిపాల్ కనకరావు ఎ పి ఎన్ జి జి ఓ ఎన్ టీ ఆర్ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణ రెడ్డి కార్యవర్గ సభ్యులు వేమూరి ప్రసాద్ బి.సతీష్ కుమార్ ఎం.రాజుబాబు మధుసూదన రావు సిటి అధ్యక్షులు సి వి ఆర్ ప్రసాద్ కార్యదర్శి నజీరుద్దీన్ మాజీ అధ్యక్షులు జి నారాయణరావు ఐ టి ఐ కళాశాల టెక్నికల్ నాన్ టెక్నికల్ ఉద్యోగులు వివిధశాఖల ఉద్యోగులు నాగార్జున దంపతులకు అభినందనలు తెలిపారు.

# ప్రారంభమైన సహకార వారోత్సవాలు

**● లింగారెడ్డి పాలెం పిఏసిఎస్ వద్ద సహకార జెండాను ఎగిరి వేసిన చైర్పర్సన్ కోట**



**కోడూరు,జూన్ 30 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ సహకార శాఖ ఆధ్వర్యంలో సహకార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లింగారెడ్డి పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సహకార జెండాను సొసైటీ చైర్ పర్సన్ కోట సుబ్బారావుఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై7వ తేదీ వరకు సహకార రచ్చబండ, సహకార వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో పి.శాంతి స్వరూప్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# వీడ్కోలు పలికిన విద్యార్థిని విద్యార్థులు



**విస్సన్నపేట,జూన్ 30 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని నరసాపురం హైస్కూల్ నందు చివరి రోజు విధులు నిర్వహిస్తూ విశ్రాంతి ఉపాధ్యాయుడైన పెండెం రామకృష్ణ మాస్టారుకు విద్యార్థిని విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అయిన రామకృష్ణ మాస్టారు మాట్లాడుతూ కన్న తల్లిదండ్రులకు చదువుకున్న పాఠశాలకు బోధించిన ఉపాధ్యాయులకు గుర్తింపు రావాలంటే బృహత్తర విజయాలు సాధిస్తున్న విద్యార్థులు వలననే ఆయన అన్నారు. తాము విద్యాబోధనలో ఉపాధ్యాయులుగా ఎంత ఎత్తు ఎదిగిన ఏనాడు కూడా తమకు ఓనమాలు దిద్దించిన గురువులు ఇప్పుడు కనబడిన ఎంతో గౌరవంగా భక్తిశ్రద్ధలతో పలకరించడం జరుగుతుందని విద్యాబోధనలో సక్రమ మార్గంలో నడిపించేందుకు విద్యార్థినీ విద్యార్థులపై కఠవుగా ఉంటాం తప్ప ఏ గురువుకు ఏ విద్యార్థి పైన ఎలాంటి కోపం ఉండదన్నారు. తరగతి గదులలో రోజువారి చెప్పే పాఠాలను ఎప్పటికప్పుడు చదువుకుంటూ తిరిగి రివిజన్ కూడా చేసుకోవాలని అప్పుడే అత్యున్నత మార్కులు సాధించవచ్చని ఆయన అన్నారు. విద్యార్థిని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా వీడ్కోలు పలికారు.

# మారెమ్మ తల్లి హుండీ ఆదాయం 12, 73,7 20 రూపాయలు - ఈవో వీడిడి ప్రసాద్



**విస్సన్నపేట,జూన్ 30 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రెల మారెమ్మ తల్లి ఆలయంలో ధర్మకర్తల మండలి దేవాదాయ ధర్మాదాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ మరియు సేవాదళ్ ల ఆధ్వర్యంలో భక్తుల అందించిన హుండీ లెక్కించినట్లు దేవాలయ కార్య నిర్వహణ అధికారి వి డి డి ప్రసాద్ తెలియజేశారు . ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టి శ్రీనివాసరావు సభ్యులు పాల్గొన్నారు.

# ఏ పి ఎమ్ పి ఏ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా తాతా విఠల్



**పెడన,జూన్ 30 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ మీడియా అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ పెడన నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా తాతా విఠల్ నియమితులయ్యారు. పెడన మండలం జింజేరు గ్రామానికి చెందిన విఠల్ గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ వార్త దినపత్రికలోపాత్రికేయునిగా పనిచేస్తున్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టి కృష్ణ ప్రసాద్ ఈ నియామకాన్ని జరిపారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను అక్రమంగా నిర్వహిస్తానని అన్నారు. పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కూడా చెప్పారు. తనకు ఈ పదవిని అప్పగించిన అసోసియేషన్ నాయకులకు విఠల్ కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం

**● డా. బి.సి. రాయ్ విగ్రహావిష్కరణ -- వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన 10 మంది ప్రముఖ వైద్యులకు సత్కారం ● డా. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్**

(మొదటిపేజీ తరువాయి)

సన్మానిస్తామన్నారు. మానవ సేవకు జీవితాన్ని అంకితం చేసిన వైద్యుల సేవలను గుర్తించి గౌరవించడం విశ్వ విద్యాలయానికి గర్వకారణమని తెలిపారు. వారి సేవలు భావితర వైద్యులకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి విశ్వ విద్యాలయ ఉపకులపతి డా. పులాల చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్, వైద్య విద్య సంచాలకులు, ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొంటారన్నారన్నారు. అల్లోపతి, దంత వైద్యం, నర్సింగ్, ఆయుర్వేదం, హోమియోపతి, యునాని వైద్య రంగాలకు చెందిన విశిష్ట వైద్యులను ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం సత్కరించనుందని ఆ ప్రకటనలో వీసీ చంద్రశేఖర్ తెలియజేశారు అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ప్రజలు ఈ వేడుకలో పాల్గొని వైద్య వృత్తికి నివాళులర్పించాలని రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ కోరారు.

# ప్రజా దర్బార్ లో వినతులు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్

## ప్రజా సమస్యలు పరిష్కారానికి తొలి ప్రాధాన్యత



**రామచంద్రపురం,జూన్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలుపై 38 వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ, మౌలిక సదు-పాయాలకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను పారదర్శకంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యల ఫిర్యాదుల విభాగం ద్వారా అందిన ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు, క్లస్టర్ ఇంచార్జి కంచుమర్తి బాబురావు కూటమి పార్టీ నాయకులు, వివిధ గ్రామాల నుంచి ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నలుగురు ముద్దాయిలు అరెస్ట్

**● 380.70 గ్రాముల బంగారం, 2కేజీల 854 గ్రాముల వెండి స్వాధీనం ● ఎస్పీ బిందు మాధవ్ వెల్లడి**





**కాకినాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** నలుగురు ముద్దాయిలు అరెస్ట్ చేసి వారి నుంచి 380.70 గ్రాముల బంగారం, రెండు కేజీల 800 గ్రాముల వెండి వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నామని అలాగే ఇంకా బిక్కవోలు పోలీస్ స్టేషన్ సంబంధించి కేసులో 46 గ్రాముల బంగారంను తణుకులోని మనప్పురం గోల్డ్ ఫైనాన్స్ బ్రాంచ్ నుండి రికవరీ చేయాల్సి ఉందని కాకినాడ జిల్లా పోలీసులు వెల్లడించారు. దీనికి సంబంధించి వివరాలను జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి బిందు మాధవ్ మంగళవారం తన కార్యాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బిందు మాధవ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఇంటి చోరీ కేసులను ఛేదించి, నలుగురు అంతరజిల్లా నేరస్తులను అరెస్ట్ చేసి, ఒక బాల నేరస్తుడును అదుపులోకి తీసుకున్నామన్నారు. కాకినాడ జగన్నాథపురానికి చెందిన ధర్మాడి దుర్గాప్రసాద్ (32), అనపర్తి మండలం బలబద్రపురం గ్రామానికి చెందిన గొర్రిపూడి వెంకటరమణ (43), అనపర్తి మండలం కుతుకులూరు గ్రామానికి చెందిన పాసి శేఖర్ (24), తాడేపల్లిగూడెం కాకర్లపూడి గ్రామానికి చెందిన గేదెల మహేష్ (30), ఒక బాల నేరస్తుడును అదుపులోకి తీసుకోగా, కాకినాడ జగన్నాథపురం గోలీలు పేటకు చెందిన చుక్క ప్రశాంత్ పరారీలో ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. వీరివద్ద నుండి 380.7 గ్రాముల బంగారం, 2.854 కిలోల వెండి, ఒక ల్యాప్‌టాప్ మొత్తం 57 లక్షల విలువైన సొత్తు రికవరీ చేశామని తెలిపారు. నిందితులు రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందని ఈ కేసును ఛేదించి నిందితులను కోరంగి గ్రామ శివాలయం వద్ద అరెస్టు చేసినట్లు ఎస్పీ చెప్పారు. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్ళినప్పుడు పోలీసులకు సమాచారాన్ని అందించాలని వారు అక్కడ ఒక సీసీ కెమెరా ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా కాపాడుతారని చెప్పారు. అలాగే అంతకుముందు ఆటో డ్రైవర్లతోనూ తల్లిదండ్రులతో ఎస్పీ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు పరిమితికి మించి విద్యార్థులను ఆటోలో పాఠశాలకు తీసుకువెళ్లొద్దని ఆటో డ్రైవర్లకు, దానికి తల్లిదండ్రులు సహకరించవద్దని ఎస్పీ చెప్పారు. అరెస్ట్ చేయడంలో విశేష కృషి చేసిన కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం వీరబాబు, క్రైమ్ ఎస్ఐ బి వెంకటేశ్వర్లు, క్రైమ్ సిబ్బంది కే గోవిందరావు, ఆర్ శ్రీనివాసరావు, కెఎస్ వర్మ, ఎల్ అజయ్ కుమార్, ఎస్ ఆంజనేయస్వామి, ఎస్ బంగారు రాజు, ఇంద్ర పాలెం స్టేషన్ సిబ్బంది పిఎల్వివిఎస్ ప్రసాద్, వై రమేష్, ఎండి మొయిన్, సిహెచ్ సూర్య తేజాలను జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

# మునుకుళ్ళ గ్రామంలో "ఖేత్ బచావో అభియాన్" అవగాహన సదస్సు



**తిరువూరు,జూన్ 30 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం మునక్కల్లు గ్రామంలో మంగళవారం "ఖేత్ బచావో అభియాన్" (పొలాలను కాపాడుకుందాం) అవగాహన సదస్సు కృషి విజ్ఞాన కేంద్రం గరికపాడు వారు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కెవికె అధిపతి డాక్టర్ ఎం రవి కిషోర్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారిని శ్రీమతి పి . పద్మజ , గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఆర్. ప్రభావతి (గృహ విజ్ఞాన విభాగం), డాక్టర్ పి .ఎన్. శివ ప్రసాద్ (సస్య పోషణ విభాగం ) హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం రవికిషోర్ మాట్లాడుతూ అవగాహన కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలను, లక్ష్యాలను రైతులకు వివరించారు. భూమిని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం డా. పి. ఎన్. శివ ప్రసాద్ మాట్లాడుతూ పంటల్లో రసాయన ఎరువులను మితిమీరి వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని, పెట్టుబడి ఖర్చులు పెరిగి దిగుబడులు తగ్గుతాయని తెలిపారు . రైతులు భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులను వాడాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఆర్. ప్రభావతి మాట్లాడుతూ.. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల పండించే ఆహార ఉత్పత్తులు కలుషితమై మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని హెచ్చరించారు. గృహ విజ్ఞాన పరంగా కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. జిల్లా వనరుల శాఖ నుంచి వ్యవసాయ అధికారి శ్రీమతి పి. పద్మజారాణి మాట్లాడుతూ రసాయన వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దీనివల్ల తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని తెలిపారు. అలాగే ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగుకు పనికిరాని వరి వంగడాల వివరాలను రైతులకు తెలియజేస్తూ, వాటిని సాగు చేయవద్దని కోరారు. విస్తరణ విభాగం ప్రతినిధులు కూడా రసాయన ఎరువుల దుష్పరిణామాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇదే వేదికపై గ్రామ వ్యవసాయ సహాయ అధికారి రైతులకు తమ మొబైల్ ఫోన్లలో ప్రభుత్వ వ్యవసాయ యాప్‌ను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలో, అందులోని సేవలను ఎలా ఉపయోగించుకోవాలో ప్రత్యక్షంగా చూపించి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో గ్రామానికి చెందిన పురుష మరియు మహిళా రైతులు పాల్గొని, శాస్త్రవేత్తలను అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్




**కాకినాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ బీఎల్‌వోలకు స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం కాకినాడ నగరంలోని శాంతినగర్ ప్రాంతంలో ఉన్న 48వ పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ నిర్వహిస్తున్న ఓటరు వివరాల ధృవీకరణ, నమోదు ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మరియు ఉన్నతాధికారులు జారీ చేస్తున్న మార్గదర్శకాలను బీఎల్‌వోలు తప్పని సరిగా పాటించాలని సూచించారు. ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా పారదర్శకంగా విధులు నిర్వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేదా నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట కాకినాడ అర్బన్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) కె.టి. సుధాకర్, సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్ఓ) మరియు అర్బన్ తహసీల్దార్ జితేంద్ర , ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ గోవిందరాజులు,తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు మందా స్వరూపరాణి,పుష్ప రాజు లకు పదవి విరమణ సన్మానం.....



**పెనుగంచిప్రోలు,జూన్ 30 (వార్తాప్రభ) :** గత తొమ్మిది సంవత్సరాలుగా పెనుగంచిప్రోలు మండలం లోని ముళ్లపాడు గ్రామంలో విద్యా సేవలు చేస్తూ మంగళవారం పదవి విరమణ చేస్తున్న మంద స్వరూప రాణి, వారి పతి బచ్చలికూర పుష్పరాజు దంపతులను పదవి విరమణ సందర్భంగా ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా పెనుగంచిప్రోలు మండల విద్యాశాఖ అధికారి డి. రవీందర్ అధ్యక్షత నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారిని జి శ్రీను , వైస్ ఎంపీపీ గుంటుపల్లి శ్రీనివాస రావు (వాసు) , నీటి సంఘం అధ్యక్షులు కొత్త హనుమంతరావు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వేల్పుల సుందర రావు , గ్రామ పెద్దలు సొసైటీ మాజీ అధ్యక్షులు గూడపాటి రవి , మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ పేరెంట్ కమిటీ చైర్మన్ గోడపాటి శ్రీనివాసరావు , ప్రధానోపాధ్యాయులు బి. లింగయ్య మరియు హరిజనవాడ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, షేక్ ప్రైమర్, చాగర్ల రామారావు , శ్రీమతి చలమల వెంకట పద్మ శ్రీమతి షేక్ రజియా బేగం విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సోమన్న "శతమానం భవతి " పుస్తకావిష్కరణ




**హైదరాబాద్, జూన్ 30 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న వందవ (100 )పుస్తకం "శతమానం భవతి " పుస్తకావిష్కరణ జూలై 5,2026న హైదరాబాద్ లో జరుగనుంది. సోమన్న ఈ వందో పుస్తకాన్ని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ గారు ఆవిష్కరిస్తారు. అనంతరం బాలసాహిత్యంలో వీరి విశేష కృషికి గాను "బాల గేయ బ్రహ్మ" బిరుదుతో సంగీత సాహిత్య సాంస్కృతిక సమన్వయ సంస్థ, హైదరాబాద్ తగురీతిగా సత్కరిస్తారని కవి గద్వాల సోమన్న ఓ ప్రకటనలో తెలిపారు.

# పదవి - బాధ్యత ఆశించే ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు చేసుకోండి..



**కోడూరు,జూన్ 30 (వార్తాప్రభ) :** జనసేన పార్టీలో పదవి - బాధ్యత ఆశించే ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రె గంగయ్య తెలిపారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యక్రయం వద్ద మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా బుధవారం ఉదయం 9 గంటలకు అవనిగడ్డ జనసేన పార్టీ కార్యాలయం వద్ద మచిలీపట్నంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు పిడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని తెలిపారు. జనసేన పార్టీలో పదవి- బాధ్యత ఆశించే ప్రతి ఒక్కరూ మీరు ఆశించే పదవి, మీరు గతంలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి, పార్టీ అధికారంలోకి రావడానికి చేసిన పనులకు సంబంధించి ఫొటోస్ దరఖాస్తుకు జతచేసి అందించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని జనసైనికులు సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆకాంక్షలకు అనుగుణంగా నూతన కమిటీల ఏర్పాటుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా



**కోడూరు,జూన్ 30 (వార్తాప్రభ) :** కోడూరు మండలంలోని లింగారెడ్డి పాలెం గ్రామంలో ఏం చేసి ఉన్న శ్రీ రామాలయం వద్ద ఏరువాక పౌర్ణమి సందర్భంగా మంగళవారం నాడుశ్రీహనుమాన్ చాలీసా పారాయణాన్ని 108 సార్లు 108 మంది భక్తులతో హారతినిస్తూ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కోడూరు మండల విశ్వహిందూ పరిషత్తు ఉపాధ్యక్షులు చిట్టిప్రోలు సుబ్రహ్మణ్యం విశ్వహిందూ పరిషత్ లింగారెడ్డి పాలెం గ్రామ అధ్యక్షుడు పిరాటి వెంకటేశ్వరరావు మరియు విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఘన సన్మానం



**విస్సన్నపేట,జూన్ 30 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పలు సచివాలయాలలో విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన ఉద్యోగులకు ఎంపీడీవో చిన్న రాట్నాలు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, ఈవో హరికృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు. 20 మంది ఉద్యోగులకు సన్మానసత్కార కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీడీవో తెలియజేశారు.

# పంతం సందీప్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం..



**కాకినాడ రూరల్,జూన్ 30 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యుత్ నగర్‌లోని చల్లా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. సామాజిక సేవా భావంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని శ్రేయోభిలాషులు, నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న రోగులకు ప్రాణదాతలుగా నిలవాలనే సంకల్పంతో 300 మందికి పైగా రక్తదానం చేయడం విశేషంగా నిలిచింది. రక్తదాన శిబిరం అనంతరం పంతం సందీప్ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు కరెడ్ల గోవిందు, తూరంగి మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము, తాతాజీ, దానయ్య, పూసల యేసు,జాహ్నవి స్టేట్ హిజ్రా కమ్యూనిటీ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు పై విస్తృత ప్రచారం



**మల్కాజిగిరి :జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వినాయక్‌నగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మంగళవారం 184, 185, 189 బూత్‌లను సందర్శించి, అక్కడ జరుగుతున్న ఓటరు నమోదు ఫార్మ్ విత్తరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు, ఓటర్లతో మాట్లాడిన ఆమె ఓటరు నమోదు దరఖాస్తులు సక్రమంగా ఎలా నింపాలి, అవసరమైన వివరాలు ఏవిధంగా నమోదు చేయాలనే అంశాలను వారికి వివరించారు. అలాగే బూత్‌లలో కొనసాగుతున్న పనులను పరిశీలించి, ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి సిబ్బంది, పార్టీ కార్యకర్తలు, స్థానిక ఓటర్లు పాల్గొన్నారు.

# బిగ్ టీవీ యాంకర్ నరసయ్య తాతతో ముచ్చర్ల ఆంజనేయులు



**సనత నగర్, జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రముఖ బిగ్ టీవీ యాంకర్ నరసయ్య తాత యాదవ్ తన వాక్చాతుర్యంతో ప్రజలను ఉత్తేజపరుస్తూ నిత్యం ప్రజల సమస్యలు తెలుసుకుంటూ బిగ్ టీవీ వ్యాఖ్యాతగా చాలా ప్రాచుర్యం పొందిన విషయం విదితమే. ప్రజల అభిమానం పొందుతున్న నరసయ్య తాత ని మర్యాదపూర్వకంగా మాదాపూర్ లో సనత్ నగర్ ఎల్లమ్మ టెంపుల్ మాజీ ధర్మకర్త ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్ కలిసి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అసదుల్ సంపత్ యాదవ్, శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత కోసం అంకితభావంతో సేవలందించిన ప్రతి ఒక్కరు అభినందనీయం

**- పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్**






**శేరిలింగంపల్లి,జూన్ 30 (వార్తాప్రభ):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో మంగళవారం పదవీ విరమణ పొందిన 14 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పదవీ విరమణ పొందిన అధికారులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు, పెన్షన్ పత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వహిస్తూ ప్రజల భద్రత కోసం అంకితభావంతో సేవలందించిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని కొనియాడారు. కుటుంబానికి దూరంగా ఉంటూ ప్రజాసేవకు ప్రాధాన్యం ఇచ్చిన వారి సేవలను గుర్తు చేశారు. పోలీసు కుటుంబ సభ్యుల సహకారం కూడా ప్రశంసనీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా తమ అనుభవాలను పోలీసు శాఖతో పంచుకుంటూ శాఖ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. విశ్రాంతి జీవితాన్ని ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, ఎస్‌బీ డీసీపీ సుధీంద్ర, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, ఏడీసీపీలు, ఏసీపీలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన సహచరులకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంటింటి సర్వేలో ప్రజలు సరి అయిన వివరాలు అందించి సర్వేకు సహకరించండి

**-బిజెపి నాయకులు మహేష్ యాదవ్**



**శేరిలింగంపల్లి,జూన్ 30 (వార్తాప్రభ):** హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్వేన్ కాలనీలో బూత్ నంబర్లు 211, 212 పరిధిలో మంగళవారం ఎస్‌ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు మహేష్ యాదవ్ బూత్ అధ్యక్షులు, బీఎల్‌ఏలు, బీఎల్‌వోలు, స్థానిక పార్టీ నాయకులు శ్రీధర్,కోటేశ్వర్ రావు, రవి గౌడ్‌లతో కలిసి సర్వేను పరిశీలించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో అమలవుతున్న తీరును పరిశీలించిన ఆయన, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా తమ వివరాలను సరైన విధంగా అందించి సర్వేకు సహకరించాలని కోరారు.

# కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకే ప్రథమ ప్రాధాన్యత

**ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ అధికారులు, స్థానికులతో కలిసి మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పాదయాత్ర**







**శేరిలింగంపల్లి,జూన్ 30 (వార్తాప్రభ):** గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖజాగూడ గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మంగళవారం అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికుల నుంచి నేరుగా తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పురాతన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్లు దెబ్బతినడంతో డ్రైనేజీ నీరు తరచూ ఇళ్లలోకి చేరుతోందని, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, మంచినీటి పైప్‌లైన్ల పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరారు. దీనిపై స్పందించిన గంగాధర్ రెడ్డి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచుతామని తెలిపారు. అవసరమైన నిధుల కేటాయింపునకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా సాంకేతిక నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని కాలపరిమితిలో పరిష్కరిస్తూ, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు, స్థానిక నాయకులు, బస్తీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జవహర్ నగర్, దమ్మాయిగూడ జేఏసీల భేటి

- రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపే లక్ష్యంగా భవిష్యత్ కార్యచరణకు అంగీకారం.
- -రెండు జేఏసీల కరపత్రాల ఆవిష్కరణ.
- జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం.





**జవహర్ నగర్, జూన్ 30:(వార్తా ప్రభ)** రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపే లక్ష్యంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ మరియు యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసీ నేతల భవిష్యత్ కార్యచణకు అంగీకారం కుదిరిందని రెండు పోరాట కమిటీలకు చెందిన చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ డాక్టర్ శంకర్ నారాయణ స్పష్టం చేశారు. 2026, జూన్-29, మంగళవారం రోజు కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోగల బీజేఆర్ నగర్, నీలం రాంచద్రయ్య భవనంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ అధ్యక్షతన కో కన్వీనర్స్, కమిటీ సభ్యుల అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. గౌరవ సలహాదారు ఆర్ నర్సింహ్మా గౌడ్, ఎస్.కె.మీరా, కోశాధికారి పి.శివబాబు, కో కన్వీనర్స్ గడ్డం సదానందం, టి.శంకర్, టి.శివన్నారాయణ, మాజీ ప్రజాప్రతినిధులు మేక లలిత యాదవ్, ఎ.సుబ్రమణ్యం, గొడుగు వేణు, బిర్రు యాకస్వామి, మహ్మద్ పాషామీయా, వై.మల్లేష్, వి.ప్రవీణ్, అనంతలక్ష్మి, పెర్క సునీత, టియుజేఏసి చర్చల చంద్రన్న ప్రసాద్ మరియు సభ్యులు సిహెచ్ మాదవరెడ్డి, సైయద్ అబ్బు, కర్రె సత్యనారాయణ, లక్ష్మీ బాయ్, రాణి, జె.ఇంద్ర పై సమావేశంలో పాల్గొన్నారు.

**ప్రత్యేక ఆహ్వానితులుగా దమ్మాయిగూడ జేఏసి:** 16 లక్షల మంది ప్రజలు వాయు కాలుష్య, నీటి కలుషితము, వివిధ అనారోగ్య సమస్యలతోపాటు పర్యావరణ ధ్వంసంపై దమ్మాయిగూడ జేఏసీ నేతలైన కన్వీనర్ డాక్టర్ బి.శంకర్ నారాయణన్, కో కన్వీనర్స్ యం. సమ్మిరెడ్డి, ఎ.సంజీవరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా జవహర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ సమావేశానికి హాజరై ప్రసంగించారు. 2016 నుండి తాము దమ్మాయిగూడ జేఏసి తరపున చేసిన న్యాయ పోరాటాన్ని వివరించారు. ప్రస్తుతం ప్రజల ప్రాణాలతోపాటు రాబోయే తరానికి మంచి గాలీ, నీరు, పర్యావరణం అందించాల్సిన బాధ్యత బాధిత ప్రాంతాల్లో ప్రశ్నించి, పోరాడే శక్తులతోపాటు కీసర, శామీర్ పేట, యాప్రాల్, కాప్రా, ఘట్ కేసర్, దమ్మాయిగూడ మండలాల ప్రజలపై ఉందని గుర్తుచేశారు. ప్రస్తుతం జవహర్ నగర్ జేఏసీ, దమ్మాయిగూడ జేఏసీలు సమిష్టిగా డంపింగ్ యార్డు ఎత్తివేసేంతవరకు ఐక్యంగా కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ఇకమీదట జవహర్ నగర్ జేఏసి తో దమ్మాయిగూడ జేఏసీ కలిసి పనిచేయడానికి హర్షాతిరేకాల మధ్య తమ సంసిద్ధతను తెలియజేశారు.

# "సర్" ప్రక్రియ పారదర్శకంగా సాగేలా చూడాలి

**మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి**



**కాప్రా, జూన్ 30:(వార్తా ప్రభ)** భారత ఎన్నికల సంఘం చేపట్టిన "సర్" సాఫీగా సాగేలా చూడాలని జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ తో కలిసి మంగళవారం ఉమ్మడి కాప్రా డివిజన్ పరిధిలోని సాయి బాబా నగర్ బూత్ నంబర్ -34,35,36,37,38 లో విస్తృతంగా పర్యటించి క్షేత్ర స్థాయిలో "సర్" ప్రక్రియ తీరును పరిశీలించారు. కాలనీలలో విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలు) కలిసి 'సర్' ప్రక్రియ ఏ విధంగా జరుగుతోంది, నమోదు మరియు మార్పుల ప్రక్రియ ఎక్కడివరకు వచ్చింది, ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తోంది అనే విషయాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిజమైన ప్రతి ఓటరుకు ఈ ప్రక్రియతో అన్యాయం జరుగకుండా చూడాలని ఎలాంటి లోపాలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్‌ఓలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ తిరుగుతున్న బూత్ స్థాయి అధికారులను (బీఎల్‌ఓలను) కలిసి, సాయి బాబా నగర్‌లో సర్వే ఏ విధంగా జరుగుతోందో అడిగి తెలుసుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది సామాన్యుడికి ఉన్న అతిపెద్ద ఆయుధమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ శ్రేణులు ఈ ప్రక్రియలో పూర్తి బాధ్యతతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "సర్" ప్రక్రియ ద్వారా అర్హులైన, నిజమైన ఒక్క ఓటరు పేరు కూడా పొరపాటున ఓటర్ల జాబితా నుండి తొలగిపోకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి అక్రమాలు, బోగస్ ఓట్లు లేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఈ ఎస్ ఐ ఆర్ సవరణ ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. ఓటర్ల సవరణ లేదా కొత్తగా నమోదు చేసుకునే ప్రక్రియలో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి సులభంగా అవగాహన కల్పించేలా మన బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ లు) సహాయపడాలని సూచించారు. ఈ కార్యక్రమం లో కాప్రా డివిజన్ అధ్యక్షులు నాగ శేషు, కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణ రాజ్ శివమణి, రాజేందర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్, జిల్లా కార్యదర్శి ఆడెపు శ్రీను, జిల్లా కార్యదర్శి మారుతి, దమ్మైగూడ పాండాల యాదగిరి గౌడ్, జగదీష్, రాకేష్ యాదవ్, ప్రదీప్, సిద్ధిఖీ, సత్యనారాయణ, శ్రీహరి, టిల్లు, రియాజ్, మల్లా రెడ్డి, నాగరాజు, మనోజ్, తోటకూర శ్రీకాంత్, చోటు భయ్యారీఫ్, షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ.

**మల్కాజిగిరి :జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి) :** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభమై జోరుగా సాగుతోందని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేటర్లు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ హనుమాన్ పేట లోని సీనియర్ సిటిజన్ ఏ. వీ స్వామి నివాసం వద్ద ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం జరిగింది. ప్రజలు అందించే ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిగా నింపి ఒక ప్రతిని బీఎల్‌ఓలకు తిరిగి అందజేయాలని, మరో ప్రతిని తమ వద్ద భద్రపరుచుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో సహకరించాలని కోరారు. అలాగే, జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరిస్తామని సంచిత్ గంగ్వార్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు



# హైదరాబాద్

## నాగారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డికి వినతి పత్రం అందజేత.

**నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి.**



**కీసర, నాగారం, జూన్ 30:(వార్తా ప్రభ)** నాగారం డివిజన్ పరిధిలోని సాయిధరణి నగర్ ఫేజ్--2 కాలనీ వాసులు, నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి రెడ్డి కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు గొలుసుల శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ ఎర్రా వేణుగోపాల్, జనరల్ సెక్రటరీ బి. శ్యామ్, జాయింట్ సెక్రటరీ బాతుల బ్రహ్మయ్య, పెద్దలు ఎం.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క ఓటు ప్రజాస్వామ్యానికి తొలిమెట్టు.

**కాంగ్రెస్ సీనియర్ అధ్యక్షులు మాట్ల వినయ్ కుమార్, నాయకులు నాయకం భాస్కర్. మాట్ల శ్రీనివాస్,**



**జవహర్ నగర్, జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఒక్క ఓటు ప్రజాస్వామ్యానికి తొలిమెట్టు అని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాయకం భాస్కర్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ శ్రేణులతో సోమవారం ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ఓటు లేకుండా ప్రజాస్వామ్యం లేదని ప్రజాస్వామ్యంలో ఓటరే విలువైన వ్యక్తి అన్నారు. జవహర్ నగర్ లో 100 శాతం నమోదే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నిలుస్తామన్నారు. అనంతరం తులసి స్కూల్లోని బూత్ నెంబర్ 582 లో ఓటర్ జాబితాలోని ఓట్ల వివరాల ఫారమ్స్ ను ప్రతి ఓటు హక్కు ఉన్న ఓటర్లకు చేరాలనే దృఢ సంకల్పంతో బి ఎల్ ఓ, బి ఎల్ ఏ లు కలిసి సంయుక్తంగా ప్రతి ఇంటికి ఓటర్ ఫారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో, యువజన కాంగ్రెస్ నాయకులు మాట్ల శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి డ్రైనేజీ వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దండి

**-సమగ్ర సమీక్ష సమావేశంలో జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్**




**శేరిలింగంపల్లి,జూన్ 30 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి జోన్‌లో డ్రైనేజీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ మంగళవారం ఇంజినీరింగ్ అధికారులు, ఎన్‌సీపీఈ కన్సల్టెంట్ ప్రతినిధులతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు. జోన్‌లోని డ్రైనేజీ నెట్‌వర్క్, నీటి ప్రవాహ సామర్థ్యం, వరద ముంపు ప్రాంతాలపై సాంకేతిక నివేదికను పరిశీలించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుత డ్రైన్ల సామర్థ్యాన్ని పెంచడం, నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించడం వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్టార్మ్ వాటర్ డ్రైన్ల అభివృద్ధి, మిస్సింగ్ లింకుల పూర్తి కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీని వేగవంతం చేయాలని ఎన్‌సీపీఈ ప్రతినిధులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్‌లో వేగంగా జరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం అత్యంత ప్రాధాన్యమని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ పేర్కొన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తక్షణ, దీర్ఘకాలిక పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో చీఫ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, ఎస్‌ఈ శంకర్, ఈఈలు, ఏసీపీలు, డిప్యూటీ ఈఈలు, ఎన్‌సీపీఈ సాంకేతిక బృందం పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జగన్ కి జనాలు మార్కులు వేస్తున్నారు !

: అధికార పక్షానికే యాంటీ ఇంకెంబెన్సీ ఉంటుందని అనుకోవడం పూర్వం రోజుల ముచ్చట. అధికార పార్టీ అయిదేళ్ళ పాలనకు విసిగి కినిసి జనాలు పొద్దు తిరుగుడు పువ్వు మాదిరిగా మూలన ఉన్న బలహీనంగా ఉన్న విపక్షాన్ని తెచ్చి అందలం ఎక్కిస్తారు అంటే అది పొరపాటే అని అంటున్నారు. గతంలో అయితే అది చెల్లుబాటు అయ్యేది కానీ సోషల్ మీడియా యుగంలో ప్రజలే అసలైన పాత్రికేయులుగా రాజకీయ విశ్లేషకులుగా మారిన తరంలో ఏ రాజకీయ పార్టీ పప్పులు అయితే అసలు ఉడకవు అని అంటున్నారు. అందువల్ల విపక్షం సరిగ్గా లేకపోతే మరిన్ని సార్లు ఉన్న చోటనే కూర్చోబెడుతున్న దాఖలాలు దేశంలో చాలా చోట్ల కనిపిస్తున్నాయని గుర్తు చేస్తునాయి ఇక దేశంలో గుజరాత్ లో చూస్తే విపక్షం మూడు దశాబ్దాలుగా లేవలేకపోతోంది. ఎపుడూ అధికార పక్షం బీజేపీనే అక్కడ గెలుస్తోంది అంటే అందులో విపక్షం చేతగానితనం పాత్ర కూడా ఉందని అంటున్నారు. మంచి ఆల్టర్నేషన్ ఉంటే కనుక జనాలు కచ్చితంగా తెచ్చి అధికారం అప్పగిస్తారు అని అంటున్నారు. ప్రజల విచక్షణ అది అని అంటున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న అధికార పక్షం కంటే కూడా విపక్షం పనితీరు మరీ నాసిరకంగా ఉంటే మాత్రం గుజరాత్ మధ్యప్రదేశ్, బీహార్ హర్యానా మహారాష్ట్ర వంటి రాష్ట్రాలలో రిపీట్ అయినట్లుగా అధికార పక్షానికే పవర్ దక్కుతుందని అంటున్నారు. ఇక దేశంలో వరుసగా మూడు సార్లు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది అంటే మోడీ సరిసాటి నాయకుడు విపక్ష శిబిరంలో లేకపోవడమే అని అంటున్నారు. మోడీకి ధీటుగా తమను తాము రుజువు చేసుకునే క్రమంలో ఇండియా కూటమి నాయకత్వం కొంత విఫలం అయింది అని అంటున్నారు. రాహుల్ గాంధీ ఇప్పుడు ఎంతో కొంత రాటు దేలారు. 2029 ఎన్నికల నాటికి ఆయన తన సామర్థ్యాన్ని గట్టిగా జనంలో ఉంచి చర్చకు తెర తీస్తే కచ్చితంగా అవకాశాలు ఉంటాయని కూడా అంటున్నారు. లేకపోతే మాత్రం జనాల ఆలోచనలు విచక్షణతను కూడా అర్థం చేసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.ఏపీలో చూస్తే విపక్షం వైసీపీ గడచిన రెండేళ్ళుగా నిర్వహించిన పాత్ర మీద అయితే జనాలు సంతోషంగా లేరని నివేదికలు సర్వేలు అంచనాలు అభిప్రాయాలు విశ్లేషణలు చెబుతున్నాయి. వైసీపీ అసలైన చట్టసభ వేదిక అయిన అసెంబ్లీని వదిలేసింది. ఇది నేల విడిచి సాము చేయడమే అని అంటున్నారు. పోనీ జనంలో అయినా వైసీపీ ఉందా అంటే అధినాయకత్వం పెద్దగా కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. జాతీయ పార్టీల అధినాయకులే ఈ రోజున నిరంతరం జనంలో ఉండేందుకు చూస్తున్నారు. అలాంటిది ఒక ప్రాంతీయ పార్టీ అయిన వైసీపీ తన పార్టీ నేతలతో క్యాడర్ తో మొక్కుబడి కార్యక్రమాలు నిర్వహిస్తే జనాలు ఆ వైపు చూసే అవకాశం పెద్దగా ఉండదని అంటున్నారు.చంద్రబాబు రెండు రెళ్ళు నాలుగు కావు : గణిత శాస్త్రంలో అయితే రెండు రెళ్ళు నాలుగు అని కచ్చితంగా జవాబు ఉంటుంది. రాజకీయ గణితంలో మాత్రం అలా జరగదని అంటున్నారు. రెండు రెళ్ళు ఆరు అయినా కావచ్చు, మూడు అయిన అవవచ్చు అని అంటున్నారు. ఏపీలో పొలిటికల్ ట్రాక్ రికార్డు చూస్తే ఒక ఎన్నికల్లో ఒక పార్టీ గెలిపించిన ప్రజలు మరో ఎన్నికల్లో ఇంకో పార్టీని గెలిపిస్తారు అని ఓల్డ్ సెంటిమెంట్ ని పట్టుకున్నా కుదిరేది కాదని అంటున్నారు. ఇలాంటి సెంటిమెంట్లు ఎన్నింటికో బ్రేకులు వేసిన చరిత్ర విచక్షణత జనాలకు ఉందని అంటున్నారు. ఏపీలో కూటమి కంటే ఏ విధంగా అయినా తాము మిన్న అని విపక్షం వైసీపీ జనాలకు చెప్పాల్సి ఉంటుంది. అలా కాకపోతే ఉన్న ప్రభుత్వాన్ని ఎందుకు తప్పించాలని జనాలు ఆల్ ఓవర్ గా డిసైడ్ అవుతారు అని అంటున్నారు. అందువల్ల వైసీపీ అయినా మరో ప్రతిపక్ష పార్టీ అయినా విపక్షంలో ఉండడమే తమకు అడ్వాంటేజ్ అనుకుంటే పొరపాటే అని నయా రాజకీయం చెబుతోంది. విపక్షంగా తమ బాధ్యతలను పూర్తిగా నెరవేర్చి జనంలో గ్రాఫ్ పెంచుకున్న పార్టీలకే జనాలు అందలం అందిస్తారు అన్నది వర్తమాన రాజకీయం రుజువు చేస్తున్న విషాంగా చెబుతున్నారు.

## ఘనంగా శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం తృతీయ వార్షికోత్సవం

### వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ







**విజయవాడ పశ్చిమ జూన్ 30: (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక చిట్టినగర్ లోని శ్రీ గుజ్జారి యల్లారావు మున్సిపల్ మార్కెట్ వద్ద గల శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు కొత్త సుబ్బారావు, అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ బాబు మాట్లాడుతూ వేకువజాము నుండే శ్రీ వీరాంజనేయ స్వామివారికి అభిషేకం, హోమం, సువర్చల సమేత వీరాంజనేయ స్వామి వారి కళ్యాణం నిర్వహించడం జరిగిందని చెప్పారు . మధ్యాహ్నం సమయంలో ప్రముఖ వ్యాపారవేత్త చింతలపూడి సత్యనారాయణ, వెంకటలక్ష్మి దంపతుల సహాయ సహకారాలతో వందలాదిమంది భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. సాయంత్రం స్వామివారికి నగర పురవీధుల్లో నగరోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమంలో దేవస్థానం ఉపాధ్యక్షులు కోన హేమ సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి సామా వెంకటస్వామి, మూడవ సహాయ కార్యదర్శి నందిగం సూరిబాబు, కోశాధికారి ఈదిఎల్లా రాజారావు, దేవస్థానం కార్యవర్గ సభ్యులు బొమ్మిశెట్టి శ్రీనివాస శంకర్, తోపూరి యలమంద, కరోతి వెంకటేశ్వరరావు, వేల్పురి రామారావు, రెడ్డిచర్ల వెంగమరాజు, జగుపిళ్ళ శ్రీనివాసరావు, గూడేల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వర్షాకాలం నేపథ్యంలో నగరంలోని ప్రధాన కాలువలు, అవుట్‌ఫాల్ డ్రైన్లు, అంతర్గత డ్రైన్లలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు చేపడుతున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని వాంబే కాలనీలో డీసిల్టింగ్ మెషిన్‌తో, బుడమేరు కాలువలో లాంగ్ ఆర్మ్, ట్రక్సర్ తో గుర్రపు డెక్కలు, బోట్ల సహాయంతో బందర్ కాలువ, ఏలూరు కాలువల్లో,ఎక్స్‌కవేటర్‌తో, ప్రతి సర్కిల్లో తేలియాడే వ్యర్థాలను తొలగించే, డీసిల్టింగ్ పనులు చేపట్టామని తెలిపారు. అలాగే నగరంలోని అన్ని ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రధాన అవుట్‌ఫాల్ డ్రైన్లలోకి వర్షపు నీరు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రవహించేలా, చిన్న డ్రైన్ల నుంచి పెద్ద కాలువల వరకు నీటి ప్రవాహానికి అంతరాయం కలిగించే పూడిక, చెత్త, ఇతర అడ్డంకులను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా కనెక్టివిటీ లోపాలు గుర్తించిన వెంటనే వాటిని సరిచేసి, వర్షపు నీటి పారుదలకు ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.ఒకవైపు డీసిల్టింగ్ పనులు కొనసాగిస్తూనే, మరోవైపు వర్షపు నీరు రహదారులపై నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారంగా అవసరమైన చోట కొత్త డ్రైన్ల నిర్మాణ పనులు కూడా చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. ప్రతి సంవత్సరం వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ గల్భర్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన ఇతర చర్యలు తీసుకుని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నామని చెప్పారు.మాన్సూన్ రెస్పాన్స్ టీం నిరంతర పర్యవేక్షణలో వర్షం కురిసిన వెంటనే నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి, నీటిని వేగంగా తొలగించే ఏర్పాట్లు చేస్తున్నామని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

## ఘనంగా సాహితీ సవ్యసాచి తూమాటి దొణప్ప శతజయంతి వేడుకలు

### శిష్ట వ్యావహారిక భాష' గ్రంథావిష్కరణ





**విజయవాడ పశ్చిమ జూన్ 30:(వార్తా ప్రభ ప్రతినిధి)**తెలుగు పదసంపద పరిరక్షణతో పాటు ప్రాంతీయ, మాండలిక, నిత్యవ్యవహార పదాలకు శాస్త్రీయ రూపం కల్పించడంలో ఆచార్య తూమాటి దొణప్ప చేసిన కృషి అపూర్వమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కె. లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.కాకరపర్తి భావనారాయణ కళాశాల, చెన్నపురి తెలుగు అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కెబిఎన్ కళాశాలలో ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దొణప్ప భాషా పరిశోధకుడిగా, సాహిత్య విమర్శకుడిగా, వ్యాకరణ పండితుడిగా, ఉత్తమ అధ్యాపకుడిగా తెలుగు సాహిత్యానికి విశేష సేవలందించారని కొనియాడారు. మాతృభాషలో పట్టు సాధించిన విద్యార్థులు ప్రపంచస్థాయి నైపుణ్యాలను సులభంగా అందిపుచ్చుకోగలరని అన్నారు.అధికార భాషా సంఘం అధ్యక్షుడు విక్రమ్ పూల మాట్లాడుతూ పరిపాలన, బోధన, అధికార వ్యవహారాల్లో తెలుగు వినియోగాన్ని మరింత విస్తరించేందుకు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. దొణప్ప రచనలు, పరిశోధనలు తెలుగు భాషా వైభవంతో పాటు తెలుగు సమాజ సాంస్కృతిక జీవనాన్ని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.దొణప్ప కుమారుడు తూమాటి సుధాకర్ మాట్లాడుతూ తమ తండ్రి సాహిత్య సంపదను ఏడు సంపుటాలుగా పునర్ముద్రించి గ్రంథాలయాలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు ఉచితంగా అందజేస్తామని వెల్లడించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి విద్యార్థుల్లో తెలుగు భాషపై అభిరుచి పెంపొందించేందుకు కళాశాల తెలుగు విభాగం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థి వికాసమే దేశాభివృద్ధికి పునాదిగా భావించిన గురు సార్వభౌముడు తూమాటి దొణప్ప అని అన్నారు.ఈ సందర్భంగా ఆచార్య తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో వెలువడిన 'శిష్ట వ్యావహారిక భాష -- నివేదిక' గ్రంథాన్ని డాక్టర్ కె. లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు.కళాశాల వైస్ ప్రిన్సిపాల్, సాహితీవేత్త డాక్టర్ కప్పగంతు రామకృష్ణ కార్యక్రమాన్ని నిర్వహించగా, చెన్నపురి తెలుగు అకాడమి ట్రస్టీ తిరునగరి భాస్కర్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ జయప్రదం చేయండి

### కార్మికుల సమస్యలపై జరిగే మహాధర్నాలో గళం ఎత్తండి



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రవ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా జూలై 7వ తేదీన చలో విజయవాడ కార్యక్రమానికి రాష్ట్ర సమితి పిలుపునిచ్చిన్నదని కార్మిక వర్గం ఈ మహా ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని విజయవాడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి బుద్దేరాజా పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం భవానిపురం 40వ డివిజన్ సానిటరీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను నిట్ట నిలువునా ముంచేయాలని ప్రయత్నిస్తున్నదని, అప్కాస్ వ్యవస్థను రద్దుచేసి కాంట్రాక్టర్ వ్యవస్థకు కార్మికులను తాకట్టు పెట్టాలని ప్రయత్నిస్తున్నదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా ఇంతవరకు నెరవేర్చలేదని అన్నారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని కార్మిక వర్గం డిమాండ్ చేస్తుంటే ఒక్క రూపాయి కూడా వేతనం పెంచకుండా ఇప్పుడు ఇస్తున్న వేతనాలను కాంట్రాక్టు వ్యవస్థకు దోచిపెట్టి కార్మిక వర్గాన్ని వారి శ్రమ ని తాకట్టు పెట్టాలని చూస్తుందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాను ఎండగడుతూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జులై ఏడవ తేదీన విజయవాడ ధర్నా చౌక్ లో జరిగే మహాధర్నాలు ప్రతీ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఎస్వీఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

## రెండో రోజూ వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు





**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చిట్టి నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ గరుడ శ్రీవెంకటేశ్వర్ స్వామి 15వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు ఉదయం స్వామివారికి విశ్వక్సేన పుణ్యా హావాచన పంచ గవ్య ప్రాసన అగ్ని మదన అగ్ని ప్రతిష్టాపన బేరి పూజ ధ్వజారోహణ నవ కుంభ రోహణ నిర్వహించారు. సంతానార్థులకు విశేష గరుడ ప్రసాదాన్ని ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ ప్రసాదం కొరకు సంతానం లేని వారు పాల్గొని ఆ ప్రసాదాన్ని స్వీకరించినచో వారికి సంతానం కలుగుతుందని ప్రతి బ్రహ్మోత్సవాల్లో ఎక్కువమంది సంతానం లేనివారు ఈ ప్రసాదాన్ని స్వీకరించి సంతానం పొందారు. అందువలన ఈ కార్యక్రమంలో విశేషంగా పిల్లలు లేని వారు పాల్గొని ఆ దేవుని ప్రార్థించుకొని ప్రసాదం స్వీకరిస్తారు ఈరోజు కార్యక్రమంలో భాగంగా హోమాన్ని నిర్వహించే సమయాన అగ్ని రూపంలో గరుత్మంతుని ఆకారం రావడం ఎంతో శుభసూచంగా అక్కడ కార్యక్రమాన్ని నిర్వహించిన తిరుమల తిరుపతి దేవస్థానం పండితులు మరియు అర్చకులు భక్తులు ఎంతో ఆనందపడ్డారు. భక్తులు తన్మయంతో స్వామివారి గోవిందా నామ స్మరణలతో చిట్టి నగర ప్రాంతం ఒక్కసారిగా కోలాలంగా మారింది. దృశ్యాన్ని చూసి భక్తులు పరిశించిపోయారు. సాయంత్రం నవగ్రహ ఆరాధన నవగ్రహ హోమం అష్టాక్షరి హోమం జరిగాయి. ఈ కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు జూలై 1 న రాత్రి 7 గంటల నుంచి శ్రీవారి కల్యాణోత్సవం ప్రారంభం అవుతుంది. భక్తులు దాతలు సమయపాలన కు సహకరించవలసిందిగా కోరడమైనది దేవస్థానం కార్యదర్శి మరుపిళ్ళా హనుమంతరావు కోశాధికారి పిళ్ళా శ్రీనివాసరావు అదనపు కార్యదర్శి పొట్లూరి రాజా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోర గంజీ భాస్కరరావు పోతిన బేసు కంటేశ్వరరావు మజ్జి శ్రీనివాసరావు పిళ్ళా విజయ్ కుమార్ దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తాగు నీటి పైపు లైన్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**54 వ డివిజన్, అంబోతుల వారి విధిలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి పరిశీలించారు..ఈ ప్రాంతంలో పైప్ లైన్ లీక్ అయ్యి గత వారం రోజులుగా తాగునీటి సరఫరాలో జాప్యం ఏర్పడడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. పైప్ లైన్లు మరమ్మత్తులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని అంబోతుల వారి వీధి లోని ప్రజలు పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించారు..కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఈ ఈ శ్రీనివాసరావు తో మాట్లాడి లీకేజీలను అరికట్టి హౌస్ సర్వీస్ కనెక్షన్ లను వేగవంతం చేయాలన్నారు

## బి ఎల్ వో లు, బిఎల్ఎ ల సమన్వయ సమావేశం



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, డిప్యూటీ డీఈఓ, సెంట్రల్ ఈఆర్వో ధ్యానచంద్ర ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల ఏఈఆర్వోలు మంగళవారం ఉదయం తమ తమ నియోజకవర్గాల్లో బీఎల్వోలు, బీఎల్ఏలతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఆర్వోలు మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ--2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఎన్యుమరేషన్ ఫారాన్ని అందజేయడంతో పాటు, ఫారాన్ని ఓటరే స్వయంగా నింపి బీఎల్వోకు తిరిగి అందజేసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎలాంటి సందేహాలు తలెత్తినా వెంటనే సంబంధిత ఏఈఆర్వో దృష్టికి తీసుకురావాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. బీఎల్ఏలు కూడా తమ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించి, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియలో సహకరించాలని కోరారు.ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించిన ప్రతిరోజు పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షిస్తూ, నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఏఈఆర్వోలు అధికారులను ఆదేశించారు.

## కోడి పందేలు స్థావరాలపై కొత్తపేట పోలీసులు ఆకస్మిక దాడులు

### ఆరుగురు నిందితుల అరెస్ట్
### కోడి పుంజు,కోడి కత్తి, రూ9840 నగదు స్వాధీనం



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని పి నైనవరం గ్రామంలో బుధవారం పోలీసులు కోడి పందేలు స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. పోలీసుల కథనం ప్రకారం బుధవారంమధ్యాహ్నం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ రామ కృష్ణ కి రాబడిన సమాచారం మేరకు సి ఐ సి హెచ్ కొండలరావు అదేశాలు మేరకు ఎస్ ఐ లు రామకృష్ణ, నవీన్ మరియు సిబ్బందితో కలసి విజయవాడ రూరల్ నైనవరం శివారు పోలవరం కాలువ ప్రక్కన క్వారీలో బహిరంగ కోడిపందాలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి 9840/- రూపాయల నగదు, ఒక కోడి పుంజు మరియు ఒక కోడి కత్తి నీ సీజ్ చేసి వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ కు విశేష స్పందన.



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో నిరంతరం ప్రజా దర్బార్ లను నిర్వహిస్తున్నారు..ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదేశాల మేరకు కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి మంగళవారం భవానీపురం ఎన్డీయే కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించిందిపశ్చిమ ప్రజలు తమ వినతులను రేషన్ కార్డులు,పింఛన్లు, తాగునీరు, ఇళ్ల స్థలాలు,వైద్య సహాయం వంటి తదితర సమస్యలపై దరఖాస్తు రూపంలో అందజేశారు.సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, పెద్ద సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే సుజన చౌదరి ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కూటమి నేతలు తెలిపారు..మైనారిటీ నాయకులు, మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్ , కామ దేవరాజ్,బీజేపీ నేత పోలవరపు దుర్గారావు , రౌతు రమ్యప్రియ పాల్గొన్నారు.

## సీఎం పర్యక నేర్వరులను పరిశీలించిన నాయకులు



**కుప్పం జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ముఖ్యమంత్రి చంద్రబాబు మూడు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఉడా ఛైర్మన్ సురేశ్ బాబుతోపాటు స్థానిక నేతలు పరిశీలించారు. కుప్పం బస్టాండు ప్రాంగణంతోపాటు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం సంబంధిత అధికారులకు సూచించారు.

# గ్యాస్ పైప్‌లైన్ భద్రతకు ప్రజల సహకారం అవసరం- జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



**మచిలీపట్నం జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సురక్షితమైన గ్యాస్ సరఫరా కోసం జిల్లాలో గెయిల్ (ఇండియా) లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపడుతున్న గ్యాస్ పైప్‌లైన్ భద్రత, నిర్వహణకు ప్రజలు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కోరారు.జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో గుడివాడ డివిజన్లోని గ్యాస్ పైప్‌లైన్ భద్రత, నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గెయిల్ అధికారులు జిల్లాలోని పైప్‌లైన్ నెట్‌వర్క్, భద్రతా చర్యలు, ఎదురవుతున్న సవాళ్లు, చేపట్టాల్సిన చర్యలను వివరించారు.గెయిల్ సంస్థ గుడివాడ బేస్ పరిధిలోని పైప్‌లైన్ ద్వారా సహజ వాయువును నిరంతరాయంగా వినియోగదారులకు సరఫరా చేస్తోందన్నారు. గుడివాడ పరిధిలో మొత్తం 89.436 కి.మీ. పైప్‌లైన్ నెట్‌వర్క్ ఉండగా, ఇందులో 43.2 కి.మీ. ఎల్‌కేపీఎల్ పైప్‌లైన్ ఉంది. ఈ పైప్‌లైన్ బాపులపాడు, నందివాడ, గుడివాడ, ముదినేపల్లి, మండవల్లి మండలాల్లోని 17 గ్రామాల మీదుగా వెళ్తుందని తెలిపారు.పైప్‌లైన్ రైట్ ఆఫ్ యూజ్ ప్రాంతంలో భవనాల నిర్మాణం, బోర్‌వెల్ తవ్వకం, చెరువులు, బావులు, రిజర్వాయర్లు తవ్వడం, లోతైన వేర్లు కలిగిన చెట్లను నాటడం, జేసీబీలు వంటి భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టడం, విద్యుత్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం, గడ్డి కాల్చడం వంటి చర్యలు పైప్‌లైన్ భద్రతకు ముప్పుగా మారుతాయని వివరించారు.పైప్‌లైన్ భద్రత కోసం గెయిల్ సంస్థ ఫుట్ పెట్రోలింగ్, డ్రోన్ సర్వేలు, హెచ్చరిక బోర్డులు, అవగాహన కార్యక్రమాలు, అత్యవసర స్పందన ప్రణాళిక, మాక్ డ్రిల్లులు, పైప్‌లైన్ సమగ్రత పరీక్షలు వంటి చర్యలను నిరంతరం అమలు చేస్తోందని తెలిపారు.గుడివాడ డివిజన్లోని ఎల్‌కేపీఎల్ పైప్‌లైన్ రూట్‌లో ప్రస్తుతం 138 చేపల చెరువులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. వీటిలో 2013లో పైప్‌లైన్ ఏర్పాటుకు ముందే 14 చెరువులు ఉండగా, 2017లో పైప్‌లైన్ ప్రారంభమైన తర్వాత 47 చెరువులు, అనంతరం మరో 77 చెరువులు ఏర్పడ్డాయని తెలిపారు. ఇది రైట్ ఆఫ్ యూజ్ ప్రాంతంలో ఆక్రమణలు పెరుగుతున్న సంకేతమని, పైప్‌లైన్ భద్రతకు ప్రమాదకరమని, ఇందుకు ప్రజల సహకారం అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.చేపల చెరువుల యజమానులు, రైతులు పైప్‌లైన్ రక్షణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. పైప్‌లైన్ భద్రత ప్రజల భద్రతతో ముడిపడి ఉన్నందున, నిబంధనలను పాటిస్తూ గెయిల్ అధికారులకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. పైప్‌లైన్‌పై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించేందుకు గెయిల్ అధికారులకు అనుమతులు ఇవ్వాలని, దీనికోసం రెవిన్యూ, మత్స్య శాఖ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో ఏఎస్పీ వివి నాయుడు, గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, గుడివాడ, బాపులపాడు, నందివాడ మండలాల తహసిల్దార్లు బివిఎస్ఆర్కె ప్రసాద్, మురళి, గురుమూర్తి, గెయిల్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎం కృష్ణమాచారి, జనరల్ మేనేజర్లు పి పోతయ్య, పి బాలకృష్ణయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంఆర్ఆర్ ప్రేమ్ కుమార్, స్పెషల్ డిప్యూటీ తహసిల్దార్ పవన్ కుమార్, మత్స్య, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలికను కుటుంబ సభ్యులకు చేర్చిన ఆత్మకూరు ఎస్సై జంపాని కుమార్



**ఆత్మకూరు జూన్ 30 (వార్తాప్రభ)** ఆత్మకూరుకు చెందిన భవిష్య అనే బాలిక తన తల్లితో కలిసి నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తూ బస్టాండ్‌లో పొరపాటున తెలియక బద్వేల్ బస్సు ఎక్కింది.బాలిక కనిపించక తల్లి ఆందోళన చెందగా బస్సు కొంచెం దూరం వచ్చిన తర్వాత బస్సులో ఉన్న ప్రయాణికులు 112 కు సమాచారం అందించారు. అప్పటికే బస్సు ఆత్మకూరు సమీపానికి చేరుకోవడంతో వెంటనే ఎస్సై జంపాని కుమార్ సిబ్బందితో కలిసి నెల్లూరుపాలెం కు చేరుకొని బాలికను సురక్షితంగా సంరక్షించి అనంతరం పాప నుండి వివరాలు తీసుకోగా పట్టణంలో తాను మేధా పాఠశాలలో చదువుతున్నట్టు సమాచారం తెలపడంతో పాఠశాల సమాచారం ఆధారంగా తల్లిదండ్రులను గుర్తించి బాలికను వారికి అప్పగించారు.పోలీసుల తీరుపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.పిల్లల విషయంలో పెద్దలు చాలా జాగ్రత్తగా ఉండాలని నిరంతరం గమనిస్తూ ఉండాలని ఈ సందర్భంగా ఎస్సై జంపానీ కుమార్ జాగ్రత్తలు సూచించారు.

## ఇంద్రకీలాద్రి అమ్మవారిని దర్శించుకున్న ఛత్తీస్‌గఢ్ ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నగర పర్యటనలో భాగంగా ఇంద్రకీలాద్రికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు మరియు అర్చక బృందం ఘనస్వాగతం పలికారు. అనంతరం విజయ్ శర్మ అంతరాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు శంకర్ శాండిల్య మరియు ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు అవురు శ్రీనివాసరావు ఉపముఖ్యమంత్రికి అమ్మవారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు.

## నేడు శ్రీ సిటీకి సీఎం చంద్రబాబు.. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

**తిరుపతి జిల్లా, శ్రీ సిటీ:జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శ్రీ సిటీ పర్యటనకు రానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. శ్రీ సిటీలో నిర్వహించనున్న కార్యక్రమంలో సీఎం పాల్గొని హీరో మోటోకార్ప్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన

SRI CITY
An Integrated Business City

చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ పర్యటన షెడ్యూల్ విడుదలైంది.ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 700 మంది పోలీసు సిబ్బందితో భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, ప్రవేశ ద్వారాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.అదేవిధంగా, సీఎం పర్యటన విజయవంతం కావడానికి శ్రీ సిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధికారులు, నిర్వాహకులతో సమీక్ష నిర్వహించి, ట్రాఫిక్, పార్కింగ్, అతిథుల స్వాగతం, భద్రత, ఇతర మౌలిక సదుపాయాలపై అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు సమాచారం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# నిష్పాక్షికంగా సర్ సర్వే పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

**సర్ ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**




**మచిలీపట్నం జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న ఇంటింటి సర్వే ప్రక్రియను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాల మేరకు బీఎల్‌వోలు, అధికారులు నిష్పాక్షికంగా, పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం నగరంలోని రైలుపేట వైఎస్సార్ నగర్ ప్రాంతంలో ఎస్ఐఆర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడం, తిరిగి స్వీకరించడం, వాటి వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయడం వంటి ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సర్ ఇంటింటి సర్వే ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. ఈసీఐ నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా పూర్తిస్థాయి నిష్పాక్షికత, పారదర్శకత, నిబద్ధతతో సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆదేశించారు.అనంతరం మల్కాపట్నం సచివాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. డిజిటైజేషన్ పనులను వేగవంతంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట బందరు ఆర్డీవో కె సాంబశివరావు, మచిలీపట్నం నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, సహాయ కమిషనర్ గోపాలరావు, ఎన్నికల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో మహాలక్ష్మి దీప మహోత్సవానికి భారీ ఏర్పాట్లు..


**రెండు వేల మంది మహిళలతో ఆధ్యాత్మిక వైభవం**





**చంద్రగిరి, జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చంద్రగిరి పట్టణంలోని చారిత్రాత్మక శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మి దీప మహోత్సవంను అత్యంత వైభవంగా నిర్వహించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులకు, నాయకులకు సూచించారు. కార్యక్రమ ఏర్పాట్లపై మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, టీటీడీ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చంద్రగిరి ప్రాంత మహిళల సౌభాగ్యం, కుటుంబాల ఆయురారోగ్యాలు, నియోజకవర్గ సుభిక్షాన్ని ఆకాంక్షిస్తూ ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని టీటీడీ నిర్వహిస్తోందన్నారు. సుమారు రెండు వేల మంది మహిళలు పాల్గొనే ఈ దీప మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.పూజలో పాల్గొనే ప్రతి మహిళకు ఉచితంగా దీపం, రైక, పసుపు, కుంకుమతో పాటు పూజా సామగ్రిని టీటీడీ తరఫున అందజేయనున్నట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, చలువ పందిళ్లు, విశాలమైన వాహన పార్కింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ భక్తులకు సేవలందించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గౌస్ బాషా, మండల అధ్యక్షులు ఏజీపల్లి బాల , టౌన్ పార్టీ అధ్యక్షులు తక్కువ ధనంజయ రెడ్డి, కోట యూనిట్ ఇంచార్జ్ లోకేష్ రాయల్, బూత్ ఇంచార్జ్ రవితేజ యాదవ్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ లీలా కృష్ణ, టిడిపి నాయకులు తులసి ,సునీల్, పండు, లీలా ,టీటీడీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పదవీ విరమణ సన్మాన మహోత్సవం



**ఆత్మకూరు జూన్ 30 (వార్తాప్రభ)** ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఎస్సీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొంతు రత్నయ్య పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఎంతో ఘనంగా అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి నాగేశ్వర వర ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నత విలువలతో కూడిన ఆదర్శ ఉపాధ్యాయుడిగా విద్యారంగానికి రత్నయ్య చేసిన సేవలు వెలకట్టలేనివని అన్నారు.మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య ధనలక్ష్మి మాట్లాడుతూ మర్రిపాడు మండల విద్యాశాఖలో క్రమశిక్షణ నైతిక విలువలు కలిగిన ఉత్తమ ఉపాధ్యాయుడిగా చిరస్మరణీయ సేవలు అందించారని ఘనంగా కొనియాడారు.అనంతరం మండలంలోని ఉపాధ్యాయు లు,బంధుమిత్రులు గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై సన్మాన కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చివరగా రత్నయ్య తన చిన్ననాటి గురువు కలిశెట్టి వెంకట రమణయ్యను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి జొన్నా సత్యనారాయణ కదిరి నాయుడుపల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర చుంచులూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ టి.యన్.పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ పోలిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తాన్ చిలకపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారుతి కేశవరెడ్డి కంపసముద్రం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి నందవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు చుంచులూరు మాజీ సర్పంచ్ యలగాల వెంకటేశ్వర్లు జిల్లా రైతు సంఘం నాయకులు మూలివెంగయ్య శ్రీ ఇంద్రాక్షి దేవస్థాన ట్రస్ట్ సభ్యులు ఇరుకుమాటి మురళీధర్ ఎస్ఎంసి చైర్మన్ ప్రసాద్ కదిరినాయుడు పల్లి క్లస్టర్ సెక్రటరీ విజయభాస్కర్ రెడ్డి రాజేంద్ర కుమార్ వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు గ్రామస్తులు బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## షేక్ నాగూర్ మిరావలి కు మస్జిద్ కమిటీ సత్కారం



**ఇబ్రహీంపట్నం, జూన్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):**ఆర్టీసీ లో 36 సంవత్సరాలుగా డ్రైవర్ గా సేవలందించి పదవి విరమణ చేసిన గ్రామానికి చెందిన షేక్ నాగూర్ మిరావలి పదవి విరమణ సభలో పాల్గొని ఘనంగా సత్కరించారు పశ్చిమ ఇబ్రహీంపట్నం మజీద్ కమిటీ సభ్యులు.ఈ సందర్భంగా మీరావాలి దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ ముస్తఫా, వైస్ ప్రెసిడెంట్ గోరే, దావుద్, హసన్ అహ్మద్, కరీముల్లా, అలీ ఖాన్, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

## వర్ధంతి జ్ఞాపకార్థం ఐదు సీలింగ్ ఫ్యాన్లు అందజేసిన మైత్రి ఫౌండేషన్



**మచిలీపట్నం జూన్ 6 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమాజ సేవలో భాగంగా మైత్రి ఫౌండేషన్ మరో సేవా కార్యక్రమాన్ని నిర్వహించింది. స్థానిక గాంధీనగర్‌లోని హైని హోమ్ ఫర్ గర్ల్స్ హాస్టల్‌లో విద్యార్థినుల సౌకర్యార్థం ఐదు నూతన సీలింగ్ ఫ్యాన్లను ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు.మైత్రి ఫౌండేషన్ గౌరవ సభ్యులు ఎర్ర అనిల్ కుమార్ తండ్రి, ఎర్ర వీరమల్లయ్య గౌడ్ వర్ధంతి జ్ఞాపకార్థం ఈ సేవా కార్యక్రమం చేపట్టారు. ఎర్ర అనిల్ కుమార్ , వారి కుటుంబ సభ్యుల పూర్తి ఆర్థిక సహకారంతో హాస్టల్‌కు ఐదు సీలింగ్ ఫ్యాన్లను అందించారు.ఇటీవల హై వోల్టేజ్ కారణంగా హాస్టల్‌లోని ఫ్యాన్లు దెబ్బతినడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న మైత్రి ఫౌండేషన్ వెంటనే స్పందించి కొత్త ఫ్యాన్లను ఏర్పాటు చేయించింది. దీంతో హాస్టల్‌లోని విద్యార్థినులు, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దాత ఎర్ర అనిల్ కుమార్ , వారి కుటుంబ సభ్యులకు మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఎర్ర వీరమల్లయ్య గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు.

## చంద్రగిరిలో జనసేన సంస్థాగత శక్తికి శ్రీకారం..


**క్షేత్రస్థాయి నాయకుల తయారీపై ప్రత్యేక దృష్టి**



**చంద్రగిరి :జూన్ 30:(వార్తా ప్రభ ప్రతినిధి)** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా చంద్రగిరిలో మంగళవారం జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఉంగుటూరు ఎమ్మెల్యే, చిత్తూరు పార్లమెంట్ పరిశీలకులు ధర్మరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ నిర్మాణ సారథుల ఎంపిక ద్వారా క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని వారు తెలిపారు. దేశంలోనే అత్యంత ప్రజాస్వామ్య విధానంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ, పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కమిటీల ఏర్పాటు ప్రక్రియ వేగంగా కొనసాగుతోందన్నారు. చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. గ్రామం నుంచి పార్లమెంట్ స్థాయి వరకు వివిధ బాధ్యతల కోసం దరఖాస్తులను పరిశీలించేందుకు 30 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ పనిచేస్తోందని వివరించారు.జూలై 3 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, జనసైనికులు, వీర మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో విజయానికి బాటలు వేయాలని కార్యకర్తలకు సూచించారు.ఈ సమావేశంలో ఏడు మండలాల అధ్యక్షులు, నామినేటెడ్ పదవులు పొందిన నాయకులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జులై 26న శ్రీ కనకదుర్గమ్మకు తెలంగాణా బోనాలు సమర్పణ.

**లాంఛనంగా సమాచార లేఖ అందజేత**



**విజయవాడ పశ్చిమ జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** హైదరాబాద్ – భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యుల బృందం మంగళవారం ఇంద్రకీలాద్రి పై శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం బోనాలు కమిటీ చైర్మన్ మధు సూదన్ యాదవ్ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ) ని కలిసి 16 సంవత్సరాలనుండి వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఈ సంవత్సరం కూడా శ్రీ కనక దుర్గ అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని, జులై 26 న కార్యక్రమం నిర్వహించేందుకు హైదరాబాద్ నుండి విచ్చేస్తామని తెలియజేస్తూ సమాచారం లేఖ అందజేశారు.

## బిపీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**మెప్మా సీఎం శ్రీధర రావు**




**ఇబ్రహీంపట్నం, జూన్ 30 (వార్తా ప్రభ ప్రతినిధి):** అర్హులైన ప్రతి వీధి విక్రయదారుడు పీఎం స్వానిధి పథకాన్ని వినియోగించుకుని తన వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని మెప్మా సీఎంఎం శ్రీధర రావు అన్నారు. సెన్సెస్ టౌన్ గుంటుపల్లి పరిధిలో వీధి విక్రయదారులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 2.0 పీఎం స్వానిధి పథకంపై మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రుణం చెల్లించడం ద్వారా భవిష్యత్ లో అధిక రుణ సదుపాయాలు పొందవచ్చన్నారు. జీవనోపాధుల సీవో రవి మాట్లాడుతూ మొదటి విడత రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలు, మూడో విడత రూ.50 వేలు రుణాలు లభిస్తాయని, మొదటి విడతలో అర్హులైన వీధి విక్రయదారులు ఉపయోగించుకోవాలని కోరారు. జీవనోపాధుల డీఆర్పీ రిట మాట్లాడుతూ 2.0 పీఎం స్వానిధి పథకం ద్వారా వీధి విక్రయదారులకు లభించే రుణ సదుపాయాలు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు విధానం, సకాలంలో రుణం చెల్లించడం వల్ల లభించే ప్రయోజనాలు, అధిక మొత్తంలో రుణం పొందే అవకాశాలు గురించి వివరించారు. డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవడం, అవసరమైన పత్రాలను సక్రమంగా సమర్పించడం, బ్యాంకులతో సమన్వయం చేసుకుని వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడం వంటి అంశాలపై వీధి విక్రయదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.

## జన సైనికులకు అగ్ర తాంబూలం

**జనసేన పార్టీలో పదవుల కోసం దరఖాస్తుల స్వీకరణ**



**ఇబ్రహీంపట్నం, జూన్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):**ఒక పక్కన పార్టీ క్యాడర్ లో జోష్ నింపుతూ కార్యకర్తలకు అగ్ర తాంబూలం దిశగా జనసేన పార్టీ అడుగులు వేస్తుంది.మరోపక్క పార్టీ బలోపేతం కోసం పటిష్ట కమిటీలు ఇది జనసేన పార్టీ నిర్మాణం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమం ఏర్పాటు చేశారని జనసేన పార్టీ కొండపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు జనసేన పార్టీ నిర్మాణ సారదుల సమాచారం సేకరణ కమిటీ సభ్యులు చెరుకుమల్లి సురేష్ తెలిపారు.పార్లమెంట్ ఇంచార్జ్ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలతో కొండపల్లి మున్సిపాలిటీ జనసేన పార్టీ అధ్యక్షుడు చెరుకుమని సురేష్, మైలవరం నాయకులు బ్రహ్మయ్య లతో కలిసి మంగళవారం సమాచార సేకరణ ప్రారంభించారు.పార్టీ కోసం నిబద్ధత పనిచేసే కార్యకర్తలకు తప్పకుండా అవకాశం లభిస్తుందని... ప్రతి ఒక్కరు ముందుకొచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## మాతా, శిశు మరణాలు నమోదు కాకుండా పటిష్ట చర్యలు

**- వైద్య, ఇతర సేవల్లో నిబద్ధతే నిండు ప్రాణాలను కాపాడుతుంది - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ, జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్త నుంచి వైద్యాధికారి వరకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో, క్రమశిక్షణతో సేవలందించాలని, ఇలా అందించే సేవలే నిండు ప్రాణాలను కాపాడుతాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.కలెక్టర్ లక్ష్మీశ.. మంగళవారం నాడు కలెక్టరేట్ కార్యాలయంలోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మాతృ, శిశు మరణాల పర్యవేక్షణ, ప్రతిస్పందన కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ, వైద్యాధికారులు, స్పెషలిస్ట్ వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బందితో, ఒక మాతృ మరణం మరియు ఐదు శిశు మరణాలపై, కారణాలను విశ్లేషించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి ప్రాణమూ అత్యంత విలువైనది.. తీసుకున్న చిన్నచిన్న జాగ్రత్తలే మాతాశిశు ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే నమోదైన మాతా, శిశు మరణాలకు




కారణాలను విశ్లేషించి, ఇలాంటి కారణాలతో భవిష్యత్తులో మరణాలు చోటుచేసుకోకుండా సమగ్ర కార్యాచరణను రూపొందించి, అమలుచేయాలని ఆదేశించారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయించుకునేలా గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. వీరు తరచు గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం, అవసరమైన మందులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది కూడా పోషకాహారం పరంగా సలహాలు సూచనలు ఇవ్వాలని, నిర్దేశించిన సరుకులు సకాలంలో అందేలా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి గర్భిణీల ఆరోగ్యం వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, హైరిస్క్ ఉన్న గర్భిణులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మావేశంలో డీఎంహెచ్వో డా. జె. ఇందుమతి దేవి , జిల్లా స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీసీ హెచ్ ఎస్ డాక్టర్ మాధవి దేవి , గైనకాలజిస్ట్ డాక్టర్ శరస్చంద్ర, డీఐఓ డాక్టర్ శరత్ బాబు, గైనకాలజీ వైద్య నిపుణులు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు తక్షణమే పూర్తి చేయండి.

**-సమీక్షా సమావేశంలో అరికపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,జూన్ 30 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు,ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనతో పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ మంగళవారం మాదాపూర్‌లోని సీఎంసీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ రహదారులు, లింక్ రోడ్లు,రోడ్ల విస్తరణ పనులను వేగవంతం చేయాలని కోరారు. కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద నిర్మించనున్న హెచ్ఐసీటీఐ ఫ్లైఓవర్ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు భూములు, భవనాలు కోల్పోతున్న వారికి టిడిఆర్ ప్రక్రియను వేగవంతం చేసి న్యాయం చేయాలని సూచించారు. మసీద్‌బండ, అంజయ్యనగర్ రోడ్ల విస్తరణ పనులు వేగంగా పూర్తి చేయాలని, గంగారం చెరువు నుంచి ఎన్‌హెచ్-65 అపర్ణ హిల్ పార్క్ వరకు లింక్ రోడ్డు పనులు టెండర్ పూర్తయిన నేపథ్యంలో త్వరగా ప్రారంభించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణాలు, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి పనులను చేపట్టాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై కమిషనర్ సృజన సానుకూలంగా స్పందించినట్లు గాంధీ తెలిపారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ సీసీపీ వెంకన్న, సీఎంసీ చీఫ్ ఇంజినీర్ శ్రీలక్ష్మి, నాయకులు మారబోయిన రాజు యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ - బస్ బే ఏర్పాటుకు కౌన్సిల్ తీర్మానం





**ఇబ్రహీంపట్నం, జూన్ 30 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి పట్టణ పరిధిలోని ఇబ్రహీంపట్నంలో ఆధునిక సౌకర్యాలతో ఈ - బస్ బే ఏర్పాటుకు కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలిపింది. కొండపల్లి పురపాలక సంఘ కార్యాలయం కౌన్సిల్ హాల్ లో మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అధ్యక్షతన మంగళవారం సాధారణ సమావేశం జరిగింది. ప్రతిపాదన ప్రకారం మోడరన్ టాయిలెట్స్, ఏటీఎం సెంటర్, మినరల్ వాటర్, కాఫీ షాప్, డిజిటల్ అడ్వర్టైజ్మెంట్ బోర్డులు, ప్రయాణికులకు అవసరమైన ఇతర సౌకర్యాలతో ఓ ప్రైవేట్ సంస్థ ఈ - బస్ బే ఏర్పాటుకు కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. అలాగే కొండపల్లి - ఈలప్రోలు మార్గంలో రైల్వే గేటు వద్ద ఆర్ యూబీ నిర్మాణానికి ఆమోదం లభించింది. పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించారు.

**వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి** వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని పలువురు అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు విజ్ఞప్తి చేశారు. టెండర్లు పూర్తయి వర్క్ ఆర్డర్లు ఇచ్చినా పనులు ప్రారంభించడం లేదని అధికార పార్టీ కౌన్సిలర్ లు ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి సమావేశంలో తీర్మానం అయిన పనులు కూడా నేటికీ ప్రారంభం కాలేదన్నారు. వార్డుల్లో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని వాపోయారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టాలని, అన్ని ప్రాంతాల్లో వీధి లైట్లు వెలిగేలా చూడాలని కోరారు. 16వ వార్డు కౌన్సిలర్ ధరణికోట విజయలక్ష్మి మాట్లాడుతూ తన వార్డులో డ్రెనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. చిన్నపాటి వర్షానికి రోడ్లపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఒక ప్రాంతంలో సగం రోడ్డు నిర్మించి వదిలేశారని, దానిని పూర్తి చేయాలని కోరారు. ఐదో వార్డు కౌన్సిలర్ మొగిలి దయా మాట్లాడుతూ వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతిరోజు వార్డుల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, ఏఈ మౌష్మీ గనియా, ఆర్వో రామకృష్ణ, మేనేజర్ వెంకట రత్నం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని బ్యానర్లపై కార్పొరేషన్ ఉక్కుపాదం

**ట్రెజరీ కాలనీలో కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ ఆకస్మిక తనిఖీ.**

**- వీధి కుక్కల నియంత్రణకు చర్యలు**



**కాకినాడ, జూన్ 30 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలో అక్రమ ఆక్రమణలు, ప్రజా సౌకర్యాలకు ఆటంకం కలిగించే నిర్మాణాలు, అనుమతులు లేని బ్యానర్లపై కాకినాడ నగర పాలక సంస్థ కఠిన చర్యలు చేపట్టింది. కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మంగళవారం 43వ డివిజన్ ట్రెజరీ కాలనీల్లో విస్తృతంగా పర్యటించి పారిశుధ్యం, డ్రైనేజీ, టౌన్ ప్లానింగ్ అంశాలను పరిశీలించారు. ట్రెజరీ కాలనీలో రహదారులపైకి అక్రమంగా విస్తరించిన భవన నిర్మాణాలను కమిషనర్ గుర్తించారు. సంబంధిత గృహ యజమానులపై చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించి ఆక్రమణలను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రహదారులు, ప్రజా స్థలాలను ఆక్రమించడం మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని, ఇటువంటి ఉల్లంఘనలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.ట్రెజరీ కాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. వీధి కుక్కలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించి అవసరమైన చర్యలు చేపట్టారు.ఇక నగరంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమాన్ని కూడా ముమ్మరం చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు కొనసాగుతున్నాయని, కాకినాడను లి"ఫ్లెక్సీ ఫ్రీ సిటీ"లిగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంస్థలు కార్పొరేషన్‌కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.కమిషనర్ వెంట ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, ఏ ఈ అర్జున్, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సత్తిబాబు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు సచివాలయ సిబ్బంది కూటమి నాయకులు ఉన్నారు.

## వక్ఫ్ బోర్డు స్థలాలు అన్యాక్రాంతానికి అధికారులే కారణం

**● తప్పుడు సర్వే నెంబర్ లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ అధికారులు ● మైనార్టీ ఆస్తుల అన్యకాంతానికి అధికారులే బాధ్యత వహించాలి ● కొండపల్లి 293 సర్వేనెంబర్ రిజిస్ట్రేషన్ అందుకు ఉదాహరణ... ● ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ బాబా**



**ఇబ్రహీంపట్నం, జూన్ 30(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వందల ఎకరాల వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవ్వడానికి కారణం వివిధ శాఖల అధికారులే అని, ముఖ్యంగా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ అధికారుల ప్రధాన బాధ్యత ఉందని ఆరోపించారు ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షులు అల్తాఫ్ బాబా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ ఆస్తులను అక్రమదారులకు సహకరిస్తున్న అధికారులు మైనార్టీ ద్రోహులుగా మిగిలి పోవడం తథ్యం అన్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం, ధన దాహం వలన మాత్రమే వలనే వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపించారు. స్థానిక రెవెన్యూ, ఇతర అధికారులు కూడా తమ వంతు పాత్ర పోషిస్తున్నారని, డబ్బుల కోసం ఎన్వోసీ లు, పన్నులు సృష్టించి అక్రమార్కులకు సహకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి ఆధారాలతో అసలు సర్వే నెంబర్ వదిలేసి, తప్పుడు సర్వే నెంబర్లతో సబ్ రిజిస్టర్ కార్యాలయం అధికారులు రిజిస్ట్రేషన్ చేసి మొత్తం వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మండిపడ్డారు. కొండపల్లి మున్సిపాలిటీలోని వక్ఫ్ బోర్డ్ భూములు సర్వే నెంబర్ లు మార్చి రిజిస్ట్రేషన్లు చేసిన దాఖలాలు వందలు సంఖ్యలో పత్రాలు ఉన్నాయని,కొండపల్లి హజరత్ ముర్తుజా అలీ పంజా సర్వే నెంబర్ 293 పీర్ల పంజా ను 2009లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని, మదర్ డాక్యుమెంట్ తప్పు ఉన్నప్పుడు రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారు రిజిస్టర్ పై ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకపోతే న్యాయం కోసం న్యాయపోరాటం తప్పదని హెచ్చరించారు. పంజాలు దర్గాలు స్మశాన వాటికలు ఖాజీమాన్యాలు ఎవరైనా ఆక్రమించి కొనుగోలు చేసి ఉంటే తస్మాత్ జాగ్రత్త ఎవరిని వదిలే ప్రసక్తే లేదు న్యాయపోరాటం చేస్తామని, వక్ఫ్ ఆస్తులు కాపాడుకుంటాం ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని అల్తాఫ్ అలీ రజా తెలిపారు.

## అభివృద్ధిలో భాగంగా నాబార్డ్ క్లస్టర్ ఏర్పాటు

**మంచిర్యాల, జూన్ 30(వార్తా ప్రభ ప్రతినిధి)** గ్రామీణ, వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమంలో భాగంగా మంచిర్యాల కేంద్రంలో నాబార్డు క్లస్టర్ ఏర్పాటు చేయడం జరిగిందని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలో నాబార్డ్ జనరల్ మేనేజర్ గణపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ చేతన్, డి.ఎ.ఓ. సురేఖ, డి.బి.ఎ.హెచ్.ఓ. యాకుబ్ రెడ్డి, ఎ.డి.సి.సి. సి.ఈ.ఓ. రవి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఉపేందర్, డి.ఐ.సి.జి.ఎం. శ్రీనివాస్ లతో కలిసి నా బార్డ్ క్లస్టర్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మాట్లాడుతూ గతంలో ఆదిలాబాద్ నుండి క్లసర్ నడపడంతో దూరాభారం అయ్యేదని, ఇపుడు మంచిర్యాలలో ప్రారంభించడం ద్వారా నాబార్డ్ సేవలు మరింత చేరువ అవుతాయని తెలిపారు. గ్రామీణాభివృద్ధికి, రైతుల సంక్షేమానికి, వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శక సంస్థగా పని చేస్తుందని, గ్రామీణ మౌలిక వసతులు, వాటర్‌షెడ్ అభివృద్ధి, మహిళా సాధికారత, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, జీవనోపాధి కార్యక్రమాల ద్వారా లక్షలాది గ్రామీణ కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకు వస్తుందని తెలిపారు.

## అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తాం.

**-కాంగ్రెస్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్**



**శేరిలింగంపల్లి,జూన్ 30 (వార్తాప్రభ):**మదీనగూడ డివిజన్ పరిధిలోని డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలకు తెలంగాణ ప్రభుత్వ మహిళా సంక్షేమ పథకంలో భాగంగా మంగళవారం ఉచిత చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హఫీజ్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు బాలింగ్ గౌతమ్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ ఆశ, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, యాదగిరి, సుదీష్, రాజు, భగత్, శ్రవణ్, వీరేందర్, గోపి, సిరీష, రవళి తదితరులు పాల్గొన్నారు.

## అన్నారెడ్డిపాలెం లో వైభవంగా రథోత్సవం



**సంగం జూన్ 29(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం అన్నారెడ్డిపాలెం గ్రామంలోని శ్రీ సీతా లక్ష్మణ సమేత ఆత్మరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల రథోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామి అమ్మవార్లను ఊరేగించగా భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకున్నారు. వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా ఆలయ ఈఓ కోవూరు జనార్దన్ రెడ్డి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ రథోత్సవానికి ఉభయకర్తలుగా కీర్తిశేషులు పులగం వెంకటేష్ శేషారెడ్డి, జ్ఞాపకార్థం వారి కుమారులు పులగం మల్లారెడ్డి కీర్తిశేషులు పులగం దయాకర్ రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటరామిరెడ్డి సోదరుడు పులగం కృష్ణారెడ్డి మని మాల మధుసూదనరెడ్డి పై కార్యక్రమాలకు వ్యవహరించారు. ఆలయ ఈఓ వరప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాను చదివిన పాఠశాలలో సన్మానితుడైన నామన శ్రీనివాసరావు

**అభినందించిన ఎమ్మెల్యే కామినేని, జనసేన నాయకులు ఏఎన్ బాబు**





**ముదినేపల్లి జూన్ 30 (వార్తా ప్రభ)**కోరుకొల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి, అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నత స్థానాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన నామన శ్రీనివాసరావును పాఠశాల నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, మాజీ శాసన మండలి సభ్యుడు కమిలి విఠల్‌రావు, కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకుడు ఏఎన్ బాబు హాజరై నామన శ్రీనివాసరావును అభినందించి, ఆయన విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొని నామన శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## నంది వాహనంపై దేవదేవేరులు



**సంగం జూన్ 30(వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం దువ్వూరు గ్రామంలోని శ్రీ గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు నంది వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం గ్రామ పురవీధులలో భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు .వేదమంత్రోచ్ఛారణలు మంగళ వాయిద్యాల మధ్య సాగిన ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి నైవేద్యాలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# 18 గంటల్లో యాప్ సమస్య పరిష్కారం..

## -ఎమ్మెల్యే రాముకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కృతజ్ఞతలు



**గుడివాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** ప్రజలకు మంచి చేయడంలో పార్టీలు, వర్గాలు చూడనని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పష్టం చేశారు. ట్రాక్టర్ ట్రైలర్స్, టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ టెంపరరీ రిజిస్ట్రేషన్ కోసం వాడే యాప్ ఓపెన్ కాకపోవడంతో ఇంజనీరింగ్ వర్క్స్ నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను 18 గంటల్లోనే పరిష్కరించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు మంగళవారం స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ పెద్దలు ప్రజా వేదిక కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే రాము దృష్టికి సమస్యను తీసుకెళ్లగానే ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. దీంతో 18 గంటల్లోనే యాప్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. అసోసియేషన్ పెద్దలు మాట్లాడుతూ యాప్ పనిచేయకపోవడంతో వ్యవసాయ ఆధారిత వాహనాలకు తాత్కాలిక రిజిస్ట్రేషన్లు కాక రైతులకు అందించలేక తీవ్ర ఇబ్బంది పడ్డామని తెలిపారు. వ్యవసాయ సీజన్ మొదలవుతున్న సమయంలో సమస్య పరిష్కారం కావడంతో ఊరట లభించిందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఫోర్ వీలర్ నమోదు అవకాశాన్ని కూడా గుడివాడలోనే ప్రారంభించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ చిన్న తరహా పరిశ్రమలు గుడివాడకు వెన్నెముక లాంటివని, వాటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడటం తన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లం రామ్మోహన్రావు, కార్యదర్శి చిన్న బాబు, కోశాధికారి నుగలాపు సురేష్, కోన శ్రీనివాస్, ఇంజనీరింగ్ వర్క్స్ నిర్వాహకులు, అసోసియేషన్ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రాణాలను కాపాడే ముందస్తు జాగ్రత్తలు

## -గుడివాడ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మూడు వైద్య సంస్థల్లో ప్రత్యేక అగ్ని భద్రత శిక్షణ

**గుడివాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా గుడివాడ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో ఈరోజు మూడు ప్రముఖ వైద్య సంస్థల్లో ప్రత్యేక అగ్ని భద్రత అవగాహన మరియు ప్రత్యక్ష ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకర దయాబెటిక్ హాస్పిటల్, శుభప్రద స్కిన్ క్లినిక్, నూఙజ మెటబాలిక్ వెల్‌నెస్ స్పెషాలిటీ క్లినిక్స్ వైద్య సంస్థల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సాంకేతిక సిబ్బంది మరియు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. శిక్షణలో అగ్నిప్రమాదాలకు దారితీసే ప్రధాన కారణాలు, వాటిని ముందుగానే నివారించే చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోగులను సురక్షితంగా బయటకు తరలించే విధానం, విద్యుత్ మరియు LPG సంబంధిత అగ్నిప్రమాదాల నివారణ, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల సరైన వినియోగంపై సమగ్రంగా వివరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ సిబ్బంది వాటర్ బ్రాంచ్ పైప్స్ ద్వారా ప్రత్యక్ష అగ్నిమాపక విన్యాసాలు నిర్వహించి, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను ఎలా ఉపయోగించాలో ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదం




సంభవించిన వెంటనే భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తూ 101 లేదా 112 అత్యవసర సేవలకు వెంటనే సమాచారం అందించాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వేగవంతం చేయాలి - జిల్లా కలెక్టర్ డీకే బాలాజి

● గూడూరులో సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



**పెడన,జూన్ 30 (వార్తాప్రభ) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని వేగవంతంగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ఎన్నికల సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం పెడన నియోజకవర్గంలోని గూడూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), ఎన్నికల విభాగం అధికారులతో కలిసి ఇంటింటి సర్వే తీరును పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, తిరిగి సేకరణ, డేటా డిజిటైజేషన్ పురోగతిపై ఆరా తీశారు. సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి డేటాను డిజిటైజ్ చేయాలని బీఎల్‌వోలను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే సేకరించిన ఫారాల వివరాలను అడిగి తెలుసుకుని, ఇంకా మిగిలిన ఫారాలను సంబంధిత ఓటర్ల నుంచి త్వరితగతిన సేకరించి నిర్ణీత గడువులోపు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చూడాలని, ఎవరూ మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఫారాల సేకరణ అనంతరం వాటిని సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా డేటా ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని చెప్పారు. సర్ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని పేర్కొన్న జిల్లా కలెక్టర్, అధికారులు సమన్వయంతో పనిచేసి నాణ్యతతో కూడిన ఓటర్ల జాబితా తయారీకి కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇంచార్జ్ డిఆర్ఓ పి పోతురాజు గూడూరు మండల తహసిల్దార్ డి రాజ్యలక్ష్మి ఎంపీడీవో టి శైలజ కుమారి, డిప్యూటీ ఎంపీడీవో చండిక ఉమామహేశ్వరరావు, బీఎల్‌వోలు తదితరులు ఉన్నారు.

# శ్రీ తిరుపతమ్మ ఆలయం వద్ద అక్రమణ దారులకు నోటీసులు






**పెనుగంచిప్రోలు,జూన్ 30 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం నుండి దేవస్థానం సత్రాలు వరకు మెయిన్ రోడ్డుకి ఇరుపక్కల ఆక్రమణలు తొలగించుట కొరకు పంచాయతీ వారు నోటీసులు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. శ్యామ్ కుమార్, మరియు సిబ్బంది పాల్గొన్నారు..



తెలుగు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి ఆధ్వర్యంలో వీరమాచినేని శైలజ వితరణతో నానమ్మ కాజా సీతా మహాలక్ష్మి తాతయ్య వెంకట సుబ్బారావు గారి జ్ఞాపకార్థం డ్రాయింగ్ బుక్స్, స్కూల్ బ్యాగులు, స్కూల్ యూనిఫామ్ లు పంపిణీ చేయడం జరిగినది. ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ స్టేడియం జాయింట్ సెక్రటరీ కిలారు రంగ ప్రసాద్ పాల్గొనగా, ఈ కార్యక్రమంలో యార్లగడ్డ సుధారాణి, వీరమాచినేని శైలజ, చల్లా ఈశ్వరి దేవి, బేతు ఆండాళ్లు, మడక ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

-గుడివాడ,జూన్ 30 (వార్తాప్రభ) :

# నేడు విద్యుత్ అంతరాయం



**కోడూరు,జూన్ 30 (వార్తాప్రభ) :** అవనిగడ్డలో గల 132/33 kv సబ్ స్టేషన్ నందు విద్యుత్ ఆధునికరణ పనులలో భాగంగా, మరియు కొత్త స్తంభాల పనుల కారణంగా ఉదయం 08:00 నుండి 12.00గంటల వరకు నాగాయలంక, కోడూరు,మండలాలలో విద్యుత్ సప్లై నిలిపివేయడం జరుగుతుంది, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఉయ్యూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ బి వి సుధాకర్ గారు ఒక ప్రకటనలో తెలిపారు

# మెడికవర్లో నూతన డయాలిసిస్, మిషన్ల విభాగాన్ని ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్..





**కాకినాడ, జూన్ 30 (వార్తాప్రభ) :** మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలిసిస్ విభాగాన్ని మంగళ వారం బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ ప్రజలకు నాణ్యమైన మరియు ఆధునిక వైద్య సేవలను అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకుందన్నారు. ముఖ్యంగా ట్రాన్స్‌ప్లాంట్ సేవలు, అరుదైన వ్యాధులకు చికిత్సలు మరియు అత్యాధునిక వైద్య సదుపాయాలను తక్కువ ఖర్చుతో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రజలకు ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ పథకాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. నూతన డయాలిసిస్ విభాగం ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మరింత మెరుగైన చికిత్స అందుతుందని, మెరుగైన క్యాన్సర్ వైద్య సేవలు, గుండె సంబంధిత మెదడు, వెన్నుముక సంబంధిత వైద్య సేవలు, అన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండటం స్థానిక ప్రజలకు ఇది ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా మెడికవర్ కాకినాడ సెంటర్ హెడ్ నందికోళ్ల అంజిబాబు మాట్లాడుతూ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే మెడికవర్ హాస్పిటల్స్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వర రావు, బీజేపీ ప్రతినిధి నాని, మెడికవర్ హాస్పిటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పైన విమర్శలు..** రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో సౌకర్యాలు లేకపోవడంతో రోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అవేమి పట్టించుకోకుండా ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పరికరాలు ప్రారంభించడం పట్ల పలువురు ఆసుపత్రికి చికిత్స కోసం చేరిన రోగులు వారి తాలూకు బంధువులు మాధవ్ పైన విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ ఆసుపత్రులను మాధవ్ సందర్శిస్తే అక్కడ సమస్యలు, రోగులు పడుతున్న ఇబ్బందులు, ఏ విధంగా వైద్యం అందుతుందో తెలుస్తాయంటూ పలువురు బాహాటంగా విమర్శించారు.

# చేయి చేయి కలుపుదాం.. గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం..

## -ఆర్మీ నాయక్ సుభేదార్ యార్లగడ్డ వీర లంకయ్య






**బాపట్ల,జూన్ 30 (వార్తాప్రభ) :** తాను పుట్టిపెరిగిన గ్రామానికి అభివృద్ధి పనులు చేయాలనే తపనతో ఆర్మీలో పనిచేసే ఓ యువకుడు ముందుకొచ్చాడు. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా కారంకిపాలెం గ్రామానికి చెందిన యార్లగడ్డ వీర లంకయ్య మహారాష్ట్ర లోని నాశిక్ ఆర్మీ లో నాయక్ సుభేదార్ గా పనిచేస్తున్నారు. తాను పుట్టి పెరిగిన గ్రామానికి తన వంతుగా ఏమి చేయాలని ఆలోచించి గ్రామంలో ఉన్న ఉద్యోగులందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చేసేదానికన్నా మనమే చేయి చేయి కలిపి ముందుకు సాగుదామని భరోసా కల్పించారు. గ్రామంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో పదవి విరమణ చేసిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. అలాగే గ్రామంలో చదువుకుంటూ మంచి మార్కులు సాధించినటువంటి ప్రతిభవంతులైన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించి ముందు తరాలకు మార్గదర్శకులుగా భావితరాలకు మార్గం చూపుతూ మంచి కార్యక్రమాలను చేపట్టారు. గ్రామంలోని 113 మంది ఉద్యోగస్తులు తలపెట్టిన ఈ మహత్తర కార్యం ఇంకా ముందుకు సాగాలని భవిష్యత్తులో ఎంతోమందికి మార్గదర్శకం కావాలని అన్నారు. గ్రామ పెద్దలు యార్లగడ్డ వెంకటేశ్వరరావు యార్లగడ్డ సాంబశివరావు యనమల తిరుపతిరావు, గ్రామ పెద్దలు గ్రామంలో అభివృద్ధి పనాలకు శ్రీకారం చుట్టిన యార్లగడ్డ వీర్లంకయ్య తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ఆకాంక్షతో ఇంతమంది ఉద్యోగస్తుల్ని ఒక గ్రూపుగా చేసి కారంకి వారి పాలెం గ్రామాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని గ్రామంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని గ్రామానికి రోడ్లు మెరుగుపరచుకోవటానికి తమ సొంత నిధులను ఏర్పాటు చేసుకొని రోడ్లు మెరుగుపరుచుకుంటున్నారు. ఇటువంటి గ్రామ ప్రజలు ఉన్న గ్రామాన్ని ఏదైనా స్వచ్ఛంద సంస్థ గాని దాతలు గాని ముందుకు వచ్చి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు అందించాలని ఆ గ్రామానికి విద్య వైద్య ఆరోగ్యం అన్ని సేవలు అందుబాటులోకి రావాలని దానికోసం నిరంతరం పోరాడుతూ యార్లగడ్డ వీర లంకయ్య నిజంగా జై జవాన్ జై కిసాన్ అనే పదాన్ని నిజం చేస్తున్నాడని అభినందించారు.

# రాయప్రోలు సుబ్బారావు, దాదాబాయి నౌరోజీ లకు ఘన నివాళి



**కృత్తివెన్ను,జూన్ 30 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెం నందు మంగళవారం ఏ దేశమేగినా ఎందు కాలిడినా ఏ పీఠం ఎక్కిన ఎవరేమైనా పొగడరా నీ తల్లి భూమి భారతిని నిలుపురా నీ జాతి నిండు గీత రచయిత రాయప్రోలు సుబ్బా రావు, గ్రాండ్ ఓల్డ్ మాన్ ఆఫ్ ఇండియా గా పిలవబడే దాదాబాయి నౌరోజి ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ వి ప్రసాద్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ వార్డు గ్రహీత కొప్పినీడి సూర్యప్రకాష్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ నవ్య కవితా పితామహుడు మరియు అభినవ నన్నయగా పేరుగాంచిన రాయప్రోలు సుబ్బారావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖకు ప్రొఫెసర్ గా హెచ్డివోగా 25 సంవత్సరాల పాటు సేవలందించారు అని జన్మభూమి గీతాన్ని రచించి తెలుగుజాతి గౌరవాన్ని ఎలుగెత్తి చాటిన ప్రసిద్ధ రచయిత అని అన్నారు. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులలో ఒక్కరైనా దాదాబాయి నౌరోజీ మూడుసార్లు కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేశారని, బ్రిటన్ పార్లమెంటుకు ఎన్నికైన తొలి భారతీయుడని భారతీయుల ప్రయోజనాల కోసం వాదించడానికి లండన్ ఇండియా సొసైటీ మరియు ఈస్ట్ ఇండియా అసోసియేషన లను స్థాపించారని డ్రైయిన్ థియరీ "ద్వారా బ్రిటీష్ వలసవాద ఆర్థిక దోపిడీని బహిర్గతం చేశారని స్వరాజ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించిన వ్యక్తి అని అతివాదులు మతవాదులు కు ఇష్టమైన వ్యక్తిగా పేరుపొంది బాలగంగాధర్ తిలక్ గోపాలకృష్ణ గోఖలే లకు రాజకీయ గురువు అని సూర్య ప్రకాష్ అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏసు పాదం మురళీకృష్ణ ప్రభ దుర్గా జ్యోతి రేఖ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపాదనే ధ్యేయం కాదు సేవచేయడంలోనే సంతృప్తి

## -క్యాపిటల్ హాస్పిటల్ అధినేత డా.విజయకుమార్

**అమలాపురం, జూన్ 30 (వార్తాప్రభ) :** "వైద్యం అనేది వ్యాపారం కాదు... ప్రాణాలను కాపాడే పవిత్రమైన సేవ" అనే భావనను ఆచరణలో నిరూపిస్తూ అమలాపురంలోని క్యాపిటల్ హాస్పిటల్ ప్రధాన ఆర్థోపెడిక్ వైద్యనిపుణుడు డా.విజయ్ కుమార్ వేలాది మంది నిరుపేదలకు ఆశాకిరణంగా నిలుస్తున్నారు. నేటి కాలంలో కార్పొరేట్ వైద్య విధానం, అధిక వైద్య ఖర్చులతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, కేవలం రూ.10 ఓపీ ఫీజుతో వైద్య సేవలు అందిస్తూ నిజమైన వైద్య ధర్మాన్ని చాటుతున్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన తోటి వైద్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూనే, గత రెండున్నర సంవత్సరాలుగా అమలాపురం, పరిసర ప్రాంతాల ప్రజలు తనపై చూపిస్తున్న విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ప్రేమ, ఆదరణ, ఆశీర్వాదాలే తనను మరింత సేవ చేయడానికి ప్రేరేపిస్తున్నాయని భావోద్వేగంగా పేర్కొన్నారు.

**తల్లి ఆశయమే సేవా కార్యక్రమాలకు మూలం..** తన జీవితంలో చేస్తున్న ప్రతి మంచి పనికి, ప్రతి సేవకు తన తల్లి నక్కా వెంకట లక్ష్మి ఆశయమే స్ఫూర్తి అని డా.విజయ్ కుమార్ తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి వైద్యం అందుబాటులో ఉండాలనే తన తల్లి కోరికను నెరవేర్చాలనే సంకల్పంతో క్యాపిటల్ హాస్పిటల్ ద్వారా ప్రత్యేక సేవా కార్యక్రమాలను ప్రారంభించినట్లు వెల్లడించారు. "డబ్బు లేక ఒక పేద మనిషి చికిత్సకు దూరం కాకూడదు. పేదవారికి కూడా మంచి వైద్యం అందాలి" అనే తల్లి ఆలోచనను తన జీవిత లక్ష్యంగా మార్చుకున్నానని చెప్పారు. అందుకే గత రెండున్నర సంవత్సరాలుగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, వితంతువులు, నిరాశ్రయులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నిరంతరం మందులు వాడాల్సిన నిరుపేదలకు కేవలం రూ.10 ఓపీతోనే నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు.

**ఐదు వేల మందికి పైగా నిరుపేదలకు ఊరట..** ఈ సేవా కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు దాదాపు ఐదు వేల మందికి పైగా నిరుపేదలు ఈ పథకం ద్వారా వైద్య సేవలు పొందినట్లు



ఆయన వెల్లడించారు. కేవలం ఫీజు తగ్గించడం మాత్రమే కాకుండా,ప్రతి రోగిని కుటుంబ సభ్యుడిలా భావించి చికిత్స అందించడం క్యాపిటల్ హాస్పిటల్ ప్రత్యేకతగా నిలుస్తోందన్నారు. తమ ప్రాంతాల్లో అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు దూరంగా ఉన్నవారు ఉంటే వారికి ఈ సేవ గురించి తెలియజేసి ప్రయోజనం పొందేలా చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**"ఆరోగ్యమే మహాభాగ్యం" -- ఆరోగ్యమే నిజమైన సంపద..** డాక్టర్స్ డే సందేశంలో ప్రజలకు ఆరోగ్యంపై విలువైన సూచనలు చేసిన డా.విజయ్ కుమార్, మన పెద్దలు చెప్పిన "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సూక్తి జీవితాంతం గుర్తుంచుకోవాల్సినదని అన్నారు.మనిషి ఎంత సంపాదించినా ఆరోగ్యం లేకపోతే ఆ సంపదకు విలువ ఉండదని పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబ,సామాజిక బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించగలమని వివరించారు.

**ఎముకల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు..** ఆర్థోపెడిక్ వైద్యుడిగా ప్రజల్లో ఎముకల ఆరోగ్యంపై అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. చాలామంది తీవ్రమైన నొప్పులు వచ్చిన తర్వాత లేదా ఎముకలు బలహీనపడిన తర్వాతే వైద్యులను సంప్రదిస్తున్నారని, అప్పటికే చికిత్స క్లిష్టంగా మారుతుందని చెప్పారు. గుండె పరీక్షలు,షుగర్ పరీక్షలు చేయించుకున్నట్లే 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒక్కసారైనా బోన్ డెన్సిటీ, క్యాల్షియం, విటమిన్-డి3 పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందుగానే సమస్యలను గుర్తిస్తే భవిష్యత్తులో వచ్చే అనేక ఎముకల వ్యాధులను నివారించే అవకాశం ఉంటుందని వివరించారు.

**క్యాపిటల్ హాస్పిటల్... సేవకు మరో పేరు..** క్యాపిటల్ హాస్పిటల్‌లో వైద్యం అంటే కేవలం రోగాలకు చికిత్స మాత్రమే కాదని, ప్రతి రోగిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు అండగా నిలవడం కూడా తమ బాధ్యతగా భావిస్తున్నట్లు డా. విజయ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి అందుబాటులో, ఆప్యాయతతో, నమ్మకాన్ని కలిగించే వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. వైద్య రంగంలో మానవత్వం నిలిచి ఉండాలంటే సేవా భావం తప్పనిసరిగా ఉండాలని అన్నారు.

**వైద్యసేవలతో పాటు సామాజిక సేవలు..** వైద్య సేవలకే పరిమితం కాకుండా, తన తల్లి పేరుతో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డా. విజయ్ కుమార్ వెల్లడించారు. అనాథ శరణాలయాలకు విరాళాలు అందించడం, అవసరమైన వారికి చేయూత ఇవ్వడం వంటి కార్యక్రమాల ద్వారా తనవంతుగా మానవతా విలువలను చాటుతున్నామని చెప్పారు. తాను చేస్తున్న ప్రతి సేవ వెనుక తన తల్లి ఆశీస్సులు, ప్రజల ప్రేమ, దేవుని అనుగ్రహమే కారణమని వినయంగా పేర్కొన్నారు.

**ఆదర్శ వైద్యుడిగా ప్రశంసలు..**నేటి పరిస్థితుల్లో వైద్య వృత్తిని సేవా మార్గంగా కొనసాగిస్తూ వేలాది మంది పేదలకు ఆశాకిరణంగా నిలుస్తున్న డా.విజయ్ కుమార్ సేవలను అమలాపురం ప్రాంత ప్రజలు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు. తల్లి ఆశయాన్ని జీవిత ధ్యేయంగా మార్చుకుని క్యాపిటల్ హాస్పిటల్ ద్వారా నిరుపేదలకు అతి తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న ఆయన వైద్య వృత్తికి ఉన్న గొప్పతనాన్ని మరోసారి సమాజానికి చాటుతున్నారు. డాక్టర్స్ డే సందర్భంగా ఆయన ఇచ్చిన ఆరోగ్య సందేశం,పేదల పట్ల చూపుతున్న మానవతా దృక్పథం, తల్లి ఆశయాన్ని నిలబెట్టేందుకు చేస్తున్న సేవా యజ్ఞం మరెందరో వైద్యులకు స్ఫూర్తిగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# రెండేళ్లలో రూ.50 కోట్లతో రామచంద్రపురం పట్టణ అభివృద్ధి

● వైసిపి నేతలు కళ్ళులేని కబోదులు ● వారికి విష ప్రచారం తప్ప, అభివృద్ధి కానరావడం లేదు ● మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎద్దేవా



**రామచంద్రపురం, జూన్ 30 (వార్తాప్రభ) :** రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో రూ. 1.70 కోట్లు (రూ.1,70,54,000) అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ఆర్ రాజు, డిఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంగళవారం శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గడచిన రెండేళ్ల పాలనలో రామచంద్రపురం పట్టణంలో రూ.50 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతి వార్డులో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. రామచంద్రపురం పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు.

**వైసిపి నాయకులు కళ్ళు లేని కబోదులు..** వైసీపీకి విష ప్రచారం తప్ప అభివృద్ధి కానరావడం లేదని ,వాళ్ళు కళ్ళు లేని కబోదులులా వ్యవహరిస్తున్నారని, అవసరమైతే వారికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా కంటి పరీక్షలు, అవసరమైన వారికి పింఛన్లు మంజూరు చేయిస్తామని చమత్కరించారు. చెప్పుకునేందుకు ఏం లేక, ప్రజలు చీకొట్టినా బుద్ధి మార్చుకోకుండా బురదజల్లే పనిలో నిమగ్నమయ్యారని విమర్శించారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ మంత్రి సుభాష్ కృషితో రామచంద్రపురం పట్టణ గతంలో లేని విధంగా అభివృద్ధి జరిగిందన్నారు. రానున్నారు మాసాల్లో మరిన్ని అభివృద్ధి పనులు జరగనున్నాయని వెల్లడించారు. నియోజవర్గానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, గరికపాటి సూర్యనారాయణ, మున్సిపల్ అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి వక్కరు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి-డాక్టర్ బి వి గురునాథ శర్మ





**విజయవాడ లీగల్, జూన్ 30 (వార్తాప్రభ) :** పని ఒత్తిడితో తీరిక లేకుండా ఉన్నప్పటికీ ఆరోగ్యం పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బీ వి గురునాథ శర్మ న్యాయవాదులకు సూచించారు. బెజవాడ బారసోసియేషన్ సెంటినీ సిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నాడు బి.బి.ఏ. లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురునాథ శర్మ మాట్లాడుతూ న్యాయవాదులు కేసులు వాదించే సమయంలో ఎంతో ఒత్తిడికి గురవుతూ ఉంటారని, ఆ కారణం చేత మానసిక శారీరక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనారోగ్యాన్ని ముందుగానే పసిగట్టి తగిన వైద్యం చేయించుకోవడం ఉత్తమమన్నారు. బి.బి.ఏ. అధ్యక్షుడు విష్ణుభట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతి న్యాయవాది ఒత్తిడిని జయించడానికి వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవితం ద్వారా మెరుగైన న్యాయ సేవలు అందించటం సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బి.బి.ఏ.ప్రధాన కార్యదర్శి వలిపోయిన కిరణ్ కుమార్, మహిళా కార్యదర్శి ఇసంశెట్టి ఉషా జ్యోతి, కార్యవర్గ సభ్యులు బందారుపల్లి లెనిన్, వేములపల్లి పద్మజ, ఎం శ్రీకాంత్, రామతేజ మరియు న్యాయవాదులకు వైద్య పరీక్షలు చేయించారు.

# ఆహార భద్రత స్ఫూర్తికి అనుగుణంగా ప్రజా పంపిణీ

● ప్రజా సంతృప్తే కార్యక్రమం సమర్థ అమలుకు గీటురాయి

● జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) స్ఫూర్తికి అనుగుణంగా జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్ట అమలుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరముందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదన్నది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసం ఈ వ్యవస్థను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆహార భద్రత చట్టం–జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియతో కలిసి ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు, రేషన్ బియ్యం పంపిణీ, వయోవృద్ధులు, దివ్యాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సకాలంలో చేరేలా రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఐవీఆర్ఎస్ కాల్స్‌కు స్పందించిన ఎన్‌టీఆర్ జిల్లా వినియోగదారుల్లో 97 శాతం మంది ప్రజా పంపిణీ వ్యవస్థపై సంతృప్తి వ్యక్తం చేశారని కలెక్టర్ తెలిపారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుకు సంబంధించి నాణ్యమైన ఆహార ధాన్యాల పంపిణీ, పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం అందించడం, ఆహార తయారీపై నిరంతర పర్యవేక్షణ తదితరాలు చాలా ముఖ్యమైనవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన భోజనం అందుతోందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పౌష్టికాహారం అందించే ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామ, మండల స్థాయి విజిలెన్స్ కమిటీలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విజిలెన్స్ కమిటీ సభ్యుడు జయరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ప్రజా పంపిణీ వ్యవస్థ మంచి పనితీరు కనబరుస్తోందన్నారు. జిల్లా సరిహద్దుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ప్రతి నెల రేషన్ కార్డుదారులతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేయాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ప్రతి రేషన్ దుకాణంలో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి వినియోగదారుల అభిప్రాయాలను సేకరించాలని కోరారు. కమిటీ సభ్యుడు కె.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ వయోవృద్ధులతో పాటు లబ్ధిదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సరఫరాల అధికారి (డీఎస్‌వో) పల్నాటి వాణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సతీష్, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం, డీఈవో ఎల్.చంద్రకళ, గిరిజన సంక్షేమం, వెనుకబడిన తరగతుల సంక్షేమం తదితర శాఖల అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని అంగడి సరుకులా మార్చొద్దు

● చంద్రబాబు ప్రైవేటీకరణ మోజుతో ప్రభుత్వ బాధ్యతను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారు

● గన్నవరం ఎంపీపీ, వైఎస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని రవి



**గన్నవరం, జూన్ 30 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రజలకు వెన్నెముకలా నిలిచిన ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రమాదకర నిర్ణయాలతో చంద్రబాబు ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గన్నవరం ఎంపీపీ, వైఎస్సార్సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనగాని రవి ఆరోపించారు. "ప్రైవేటీకరణ అంటే ప్రభుత్వ బాధ్యతను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడమే. ఈ రోజు ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ కంపెనీలకు అప్పగిస్తున్నారు. రేపు లాభదాయక రూట్లను ఇస్తారు. ఎల్లుండి డిపోలు, వర్క్‌షాప్‌లు, ఇతర సేవలను కూడా ప్రైవేట్ చేతుల్లో పెడతారు. చివరకు ఆర్టీసీ పేరు మాత్రమే మిగులుతుంది. ఇదే ప్రైవేటీకరణ కాకపోతే మరేమిటి?" అని ప్రశ్నించారు. "ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడానికి ఉందా? లేక ప్రైవేట్ కంపెనీలకు వ్యాపారం కల్పించడానికి ఉందా? ప్రభుత్వమే నడపాల్సిన ప్రజారవాణా వ్యవస్థను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం తన రాజ్యాంగబద్ధమైన బాధ్యత నుంచి తప్పుకుంటోంది. ఇది ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయం" అని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తే, ఇప్పుడు అదే సంస్థను క్రమంగా బలహీనపరిచి ప్రైవేట్ కంపెనీలకు అవకాశాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. "ఆర్టీసీకి అనుభవజ్ఞులైన డ్రైవర్లు, మెకానిక్లు, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. వేలాది మంది ఉద్యోగులు ఉండగా ప్రైవేట్ కంపెనీల అవసరం ఏమిటి? ప్రభుత్వం బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీ ఉద్యోగులతోనే నడిపిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయి. కానీ కావాలనే ప్రైవేట్ కంపెనీలకు నిర్వహణ అప్పగించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం చెప్పాలి" అని డిమాండ్ చేశారు. "చంద్రబాబు గతంలో విద్యుత్, ప్రభుత్వ సేవలు, ఇతర రంగాల్లో ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇచ్చినట్లే, ఇప్పుడు ఆర్టీసీపై కూడా అదే విధానాన్ని అమలు చేస్తున్నారని ప్రజలు భావిస్తున్నారు. ప్రజల ఆస్తులను, ప్రజల సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ఆలోచనను వెంటనే విరమించుకోవాలి" అని అన్నారు. "ఆర్టీసీ అనేది కేవలం ఒక సంస్థ కాదు. రోజూ లక్షలాది మంది విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, వృద్ధులు ఆధారపడే ప్రజారవాణా వ్యవస్థ. అలాంటి సంస్థను లాభనష్టాల కోణంలో చూసి ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే, భవిష్యత్తులో చార్జీల పెంపు, ఉద్యోగాల కోత, గ్రామీణ ప్రాంతాల్లో సేవల తగ్గుదల వంటి పరిణామాలు వచ్చే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, కొత్త బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి, ఆర్టీసీ ఉద్యోగులతోనే నడపాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి సంస్థను మరింత బలోపేతం చేయాలని అనగాని రవి డిమాండ్ చేశారు. "లేకపోతే కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని హెచ్చరించారు.

# ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే అరెస్టు : జిల్లా ఎస్పీ బిందు మాధవ్



**కాకినాడ,జూన్ 30 (వార్తాప్రభ) :** ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే అరెస్టులు తప్పవని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ హెచ్చరించారు. 300 మంది ఆటో డ్రైవర్లు, విద్యార్థుల తల్లిదండ్రులకు జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆటోల్లో అనుమతించిన పరిమితికి మించి విద్యార్థులు లేదా ప్రయాణికులను ఎక్కించడం చట్టవిరుద్ధమే కాకుండా ప్రాణాంతకమని స్పష్టం చేశారు. గతంలో అధిక సంఖ్యలో విద్యార్థులను ఆటోలో తీసుకెళ్లడం వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక చిన్నారి మృతి చెందిన ఘటనను గుర్తుచేస్తూ, అలాంటి విషాదాలు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే అరెస్టు కూడా చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు తక్కువ ఖర్చు కోసం అధిక సంఖ్యలో పిల్లలను ఒకే ఆటోలో పంపించకుండా, అవసరమైతే అదనపు చార్జీ చెల్లించి అయినా భద్రతకు ప్రాధాన్యత ఇచ్చే వాహనాల్లోనే తమ పిల్లలను పాఠశాలకు పంపించాలని సూచించారు. పిల్లల ప్రాణ భద్రత అందరి బాధ్యత అని, రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించడం ద్వారా మాత్రమే ప్రమాదాలను నివారించగలమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు, తల్లిదండ్రులు పరస్పర సహకారంతో విద్యార్థుల సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, కాకినాడ సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసర్ పాటిల్ దేవరాజ్ మనీష్,ఎస్బీ డిఎస్పీ కెవివి. సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు ఎన్. రమేష్, డి రామారావు, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కొమ్మర గంగాధర్ ఆరోపణలు అవాస్తవం

● లక్కిరెడ్డిపల్లి ఇంచార్జ్ సీఐ రోషన్ ● మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబానికి ఎటువంటి ప్రమేయం లేదు ● ఆరోపణలు చేస్తున్న రాజేంద్ర రెడ్డికి అసలు భూమే లేదు ● గంగాధర్ పై 2023లోనే రౌడీ షీట్ నమోదు



**లక్కిరెడ్డిపల్లి,జూన్ 30 (వార్తాప్రభ) :** కొమ్మర గంగాధర్ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, అవి పూర్తిగా అవాస్తవాలని లక్కిరెడ్డిపల్లి ఇంచార్జ్ సీఐ రోషన్ స్పష్టం చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులకు గానీ, ఆయన అనుచరులకు గానీ ఈ వ్యవహారంతో ఎటువంటి ప్రమేయం లేదని సీఐ తేల్చి చెప్పారు. అసలు ఆరోపణలు చేస్తున్న రాజేంద్ర రెడ్డి అనే వ్యక్తికి అక్కడ ఎలాంటి భూమీ లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు తనను వేధించి అక్రమంగా కేసులు నమోదు చేశారని గంగాధర్ చేసిన ఆరోపణలను సీఐ రోషన్ తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి గంగాధర్ పై గతంలోనే ఐదు కేసులు ఉన్నాయని, దానికి గానూ 2023లోనే అప్పటి పోలీసు అధికారులు అతనిపై రౌడీ షీట్ నమోదు చేశారని గుర్తుచేశారు. తనపై ఉన్న కేసులను కప్పిపుచ్చుకునేందుకే పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఎవరికైనా అన్యాయం జరిగిందని భావిస్తే నేరుగా పోలీసులను ఆశ్రయించాలని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధితులకు కచ్చితంగా న్యాయం చేస్తామని సీఐ రోషన్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు..

# తాను చదివిన పాఠశాలలో సన్మానితుడైన నామన శ్రీనివాసరావు

● అభినందించిన ఎమ్మెల్యే కామినేని, జనసేన నాయకులు ఏఎన్ బాబు





**ముదినేపల్లి,జూన్ 30 (వార్తాప్రభ) :** కోరుకొల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించి, అనంతరం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నత స్థానాలకు చేరుకుని ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసిన నామన శ్రీనివాసరావును పాఠశాల నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, మాజీ శాసన మండలి సభ్యుడు కమిలి విఠల్‌రావు, కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకుడు ఏఎన్ బాబు హాజరై నామన శ్రీనివాసరావును అభినందించి, ఆయన విద్యారంగానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు పాల్గొని నామన శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా గుడివాడ రోటరీక్లబ్ అవార్డు నైట్ ఫంక్షన్



**గుడివాడ, జూన్ 30 (వార్తాప్రభ) :** సేవలో అగ్రభాగంలో ఉంటున్న "గుడివాడ రోటరీ క్లబ్" అవార్డు నైట్ ఫంక్షన్ స్థానిక రాజేంద్రనగర్ జీవి పూర్ణచంద్రరావు ఫంక్షన్ హాల్ నందు ఘనంగా జరిగింది. ఇటీవల విశాఖపట్నం స్టీల్ సిటీలో జిల్లాల కాన్ఫరెన్స్ జరిగిన సందర్భంగా పలురకాల సేవా కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు గాను 9 అవార్డులను ఇవ్వగా వాటిని 25 -- 26 సంవత్సరములకు అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న యలమంచిలి నాగేశ్వరరావు, గుళ్లపల్లి కిరణ్ బాబు లు రోటరీ సభ్యుల ముందు ప్రదర్శించగా క్లబ్ కౌన్సిలర్, ప్రముఖ ఆడిటర్ జి బాబు శ్రీకర్ వారిని ఘనంగా సత్కరించారు. అసిస్టెంట్ గవర్నర్ ముళ్లపూడి రమణమూర్తి, స్థలదాత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు లను ప్రత్యేకంగా సన్మానించారు. ఇప్పటివరకు జరిగిన సేవా కార్యక్రమాలలో భాగంగా దాతలు ఇచ్చిన సొమ్ము కాకుండా అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరావు ఐదు లక్షలు పైగా వెచ్చించడంపై సభ్యులందరూ ఆయనను అభినందించారు. రాబోయే కొత్త కమిటీ మరిన్ని సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుదామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పొట్లూరి విశ్వేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు యలమంచిలి రెడ్డయ్య చౌదరి, టి యన్ రాజశేఖర్, పొన్నూరు రామకృష్ణ, డాక్టర్ మలిరెడ్డి రవి, బలుసు శంకర్రావు, జి నరేష్, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, జాస్తి రమాదేవి, ఎం చిన్నమ కుమారి, యలమంచిలి లవిత్ర పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ చొరవతో ఇంటర్ లెక్చరర్ లకు పదోన్నతులు



**అమరావతి,జూన్ 30 (వార్తాప్రభ) :** ఇంటర్మీడియట్ లెక్చరర్లకు నిబంధనల ప్రకారం డిగ్రీ కాలేజీ లెక్చరర్లు గా పదోన్నతి అవకాశం ఉన్నప్పటికీ గత 13 సంవత్సరాలుగా అనగా రాష్ట్ర విభజన తర్వాత అమలు చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ అన్నారు. ఈ విషయంలో మన మహిళా విభాగం అధ్యక్షురాలు డా. పామర్తి లీలావతి తో సహా కొందరు రాష్ట్ర హై కోర్టు ద్వారా ఉత్తర్వులు పొందినప్పటికీ ఆ శాఖలో అమలు చేయడంలేదన్నారు. డీ.ఎల్. ఐక్యవేదిక సభ్యసంఘం లెక్చరర్స్ అసోసియేషన్ వారి అభ్యర్థన మేరకు సంఘం గత నెలలో సంబంధిత అధికారులు అందరికీ రిప్రజెంట్ చేయడం జరిగిందన్నారు. అయినా వివిధ కారణాలతో ఈ పదోన్నతులు అమలు చేయడం లేదన్నారు. సోమవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామ సూర్యనారాయణ నేతృత్వంలో 100 మంది వివిధ జిల్లాలకు చెందిన జూనియర్ లెక్చరర్లు డిగ్రీ కాలేజీ కమిషనర్ ను నిలదీయడం జరిగింది. అధ్యక్షులు ఐఏఎస్ అధికారి భరత్ గుప్తాకి గట్టి హెచ్చరిక చేశారు. ఈ విషయం రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. మంత్రి నారా లోకేష్ జులై 5 తేదీ లోగా పదోన్నతులు కల్పించాలని నిర్ణయించి, ఓ ఎస్ డి ద్వారా రాష్ట్ర అధ్యక్షులకు సమాచారం ఇచ్చారన్నారు. పుష్కరకాలంగా పేరుకుని ఉన్న సమస్య ఏపీజేఏ చొరవ తో పరిష్కారం అయిందన్నారు.

# ఓటు మన హక్కు మన తలరాత - నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్



**హైదరాబాద్, జూన్ 30 (వార్తాప్రభ) :** నేతాజీ నగర్ కాలనీలో కాలనీ అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహించడం జరిగింది. ఓటర్ల జాబితాలో ఓటర్ కార్డులో ఏవైనా సవరణలు ఉంటే తప్పకుండా సరి చేసుకోవాలని అన్నారు. ఓటు అనేది సాధారణమైన విషయం కాదని అది మన హక్కు అని మన తలరాత అని అన్నారు. కాలనీలో అందరూ తప్పనిసరిగా ఈ సవరణ ప్రక్రియను ఉపయోగించుకోవాలని అన్నారు. నేతాజీ నగర్ కాలనీలో దాదాపు 3000 ఓటర్లు ఉండడం మరియు నల్లగండ్ల దూరంగా ఉండటంతో ఓటు వేయడానికి తమకు దగ్గరలో ఒక బూత్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి నోడల్ ఆఫీసర్ దీపక్, బి ఎల్ ఓ పరమేష్, నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, తిరుమలేష్, మౌలానా, ఇంటింటికి తిరిగి ప్రతి ఒక్కరికి ఈ సవరణ ప్రక్రియను సమర్థవంతంగా అవగాహన కల్పించడం జరిగింది అని అన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188